సాక్షి
కర్నూలు
శనివారం ౹ 21 ౹ అక్టోబర్ ౹ 2023



కిడ్నాపర్ల అరెస్ట్

క్రషర్ వ్యాపారి కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడితో సహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రెండు విడతల్లో రూ.3.6 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. IIలో



బెట్టింగ్‌రాయుళ్ల 'ఆట'కట్టు

ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని ఆదోని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8,25,000 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. IIలో



కేసీ కాల్వకు నీరు విడుదల

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 331 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. రిజర్వాయర్‌లో 0.661 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

న్యూస్‌రీల్

బన్ని ఉత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

- కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం



ఆలూరు: విజయదశమి ఉత్సవాల్లో భాగంగా దేవరగట్టులో ఈనెల 24వ తేదీ రాత్రి జరిగే మాళమల్లేశ్వరస్వామి బన్ని ఉత్సవాన్ని భక్తులు ప్రశాంతంగా జరుపుకోవాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం సూచించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం మంత్రి జయరాం మాట్లాడుతూ ఉత్సవానికి అధిక సంఖ్యలో తరలివచ్చే భక్తులకు తాగునీరు, విద్యుత్, ప్రత్యేకంగా వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధానంగా దేవర గట్టుకు వెళ్లే రహదారిని మరమ్మతులు చేయాలన్నారు. 108, అగ్నిమాపక వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఉత్సవం ముగిసే వరకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

మరింత పెరిగిన ఉల్లి ధర

- క్వింటా రూ.3,599



కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి ధర మరింత పెరిగింది. ఈ ఏడాది వర్షాభావం వల్ల ఉల్లి సాగుతో పాటు దిగుబడులు తగ్గడం వల్ల దేశ వ్యాప్తంగా ఉల్లికి కొరత ఏర్పడుతోంది. ఇందువల్ల ధరలు పురోగమనంలో ఉండటం విశేషం. కర్నూలు మార్కెట్‌కు శుక్రవారం 85 మంది రైతులు 2,120 క్వింటాళ్ల ఉల్లి తీసుకొచ్చారు. క్వింటాకు కనిష్ట ధర రూ.660, గరిష్ట ధర రూ.3,599 లభించింది. ఖరీఫ్‌లో ఉల్లి సాధారణ సాగు 16,753 హెక్టార్లు ఉండగా ఈ-క్రాప్ బుకింగ్ ప్రకారం 16,498.8 హెక్టార్లలో సాగయింది. ఈ నెల 19న గరిష్టంగా రూ.3,331 ధర లభించింది. తాజాగా క్వింటాపై రూ.268 పెరిగి రూ.3,599కి చేరింది.

- కాగా మార్కెట్‌కు వేరుశనగ ఎక్కువగా వచ్చింది. 210 మంది రైతులు 1,363 క్వింటాళ్ల వేరుశనగ తెచ్చారు. కనిష్టంగా రూ.2,079, గరిష్టంగా రూ.7,416 పలికింది.
- ఎండుమిర్చికి గరిష్టంగా రూ.17,199, వాముకు రూ.17,500, కందులకు రూ.9,960 ప్రకారం ధరలు లభించాయి.

ఆర్‌యూ పాలక మండలి సభ్యుల నియామకం

కర్నూలు(న్యూసిటీ): రాయలసీమ విశ్వవిద్యాలయం పాలక మండలిని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె.శ్యామలరావు జీఓ 107 జారీ చేశారు. పాలక మండలి సభ్యులుగా ఎకనామిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌టీపీ.నాయక్(ఆర్‌యూ), సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సీవీ.కృష్ణారెడ్డి(ఆర్‌యూ), ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సునీత(ప్రభుత్వ డిగ్రీ కాలేజీ, నందికొట్కూరు), ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.నరసింహులు (డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు, ఆర్‌యూ), డాక్టర్ శైలజ రాణి(ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నంద్యాల)ని నియమించినట్లు ఉపకులపతి ఆచార్య ఎ.ఆనందరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీరు మూడేళ్లపాటు పాలక మండలి సభ్యులుగా కొనసాగుతారన్నారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎ.ఆనందరావు చైర్మన్‌గా ఏర్పాటైన పాలక మండలిలో నూతనంగా నియమితులైన సభ్యులతోపాటు రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి జె.శ్యామలరావు, కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్, ఏపీ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య ఎ.హేమచంద్రారెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థికశాఖ కార్యదర్శి, ఎక్స్ అఫీషియో సభ్యులుగా యూనివర్సిటీ రెక్టార్ కొనసాగుతారన్నారు. పాలక మండలి సభ్య కార్యదర్శిగా వర్సిటీ రిజిస్ట్రార్ వ్యవహరిస్తారని ఆయన వివరించారు.

భరోసా తోడై.. జీవనం మెరుగై!

మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- డీఆర్‌డీఏ, వైకేపీ ద్వారా రూ.6975.11 కోట్లు వ్యయం
- టీడీపీ హయాంలో వెచ్చించిన నిధులు రూ.1367.11 కోట్లే
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వ్యాపారవేత్తలుగా మహిళలు
- 90 శాతం మహిళలకు ప్రభుత్వ ఆర్థిక తోడ్పాటు
- 12,270 మందికి రూ.70.30 కోట్లతో జీవనోపాదుల అభివృద్ధి

కర్నూలు(అగ్రికల్చర్): మహిళా సంక్షేమమే లక్ష్యంగా వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా మహిళలకు పలు పథకాలు అమలు చేస్తోంది. వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక సహా మహిళల సంక్షేమానికి వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం రూ.6,975.11 కోట్లు ఖర్చు చేసింది. 2014 ఎన్నికల్లో డ్వాక్రా రుణాలన్నిటినీ మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు.. అధికారం చేపట్టిన వెంటనే హామీకి తూట్లు పొడిచారు. 2014-15 నుంచి 2018-19 వరకు పొదుపు మహిళలకు పావలా వడ్డీ, బ్యాంకు లింకేజీ రుణాలు సామాజిక భద్రత పింఛన్లు మినహా ఇతరత్రా ఎలాంటి సంక్షేమ పథకాలు లేవు. టీడీపీ హయాంలో(ఐదేళ్లలో) సామాజిక భద్రత పింఛన్ సహా మహిళల అభ్యున్నతికి చేసిన ఖర్చు రూ.1367.21 కోట్లు మాత్రమే. వైఎస్‌ఆర్‌సీపీ పాలన మహిళలకు స్వర్ణయుగమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రతి మహిళకు ఆర్థిక తోడ్పాటు

జిల్లాలో 34వేల స్వయం సహాయ సంఘాలు ఉండగా 3.50 లక్షల మంది సభ్యులు ఉన్నారు. ప్రభుత్వం మహిళల అభ్యున్నతే లక్ష్యంగా జగనన్న తోడు, వైఎస్ఆర్ చేయూత, జగనన్న ఆసరా, వైఎస్‌ఆర్ సున్నా వడ్డీ పథకాలను పకడ్బందీగా అమలు చేస్తోంది. ప్రభుత్వం వివిధ కార్యక్రమాల కింద ఆర్థిక తోడ్పాటు ఇస్తుండగా.. బ్యాంకులు కూడా ఉదారంగా రుణాలు అందిస్తున్నాయి. ఈ కారణంగానే నేడు మహిళలు 134 రకాల వృత్తుల్లో రాణిస్తుండటం విశేషం.



కోడుమూరులోని మహిళా మార్ట్

పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్న వైనం

- జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల అమ్మక కేంద్రం ఏర్పాటైంది.
- కోడుమూరులో నెలకొల్పిన మహిళా మార్ట్ రాష్ట్రానికి ఆదర్శంగా ఉండటం విశేషం.
- రానున్న రోజుల్లో అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో నెలకొల్పడానికి కసరత్తు జరుగుతోంది. జ్యూట్‌బ్యాగ్‌ల తయారీలో రాణిస్తున్నారు.
- స్వీట్లు వివిధ తినుబండరాలు తయారు చేసి షాపులకు సరఫరా చేస్తున్నారు.
- పసుపు, కారం పొడి మిషన్‌లతో ఉపాధి పొందుతున్నారు.
- ఉదీబత్తీలు తయారు చేస్తున్నారు.
- రొట్టెల తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు.
- పొట్టేళ్లు, పెరటికోళ్ల పెంపకం, పాడి అభివృద్ధి, పాలకోవ తయారీ, చీరల వ్యాపారాలు, కిరాణం వ్యాపారం, విజిటబుల్ సోలార్ డ్రైయర్లు వంటి వాటిల్లో అద్భుతంగా రాణిస్తున్నారు.

రికార్డు స్థాయిలో రూ.6975.11 కోట్ల వ్యయం

2019-20 నుంచి ఇప్పటి వరకు డీఆర్‌డీఏ-వైకేపీ ద్వారా వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక సహా మహిళల అభ్యున్నతికి రూ.6,975.11 కోట్లు ఖర్చు చేయడం విశేషం. టీడీపీ హయాంలో పెన్షన్ కింద రూ.1000 మాత్రమే చెల్లించడం జరిగేది. 2019 ఫిబ్రవరిలో అంటే అసెంబ్లీ ఎన్నికల ముంగిట ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు పింఛను మొత్తాన్ని రూ.2వేలకు పెంచారు. వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే పింఛను మొత్తాన్ని రూ.2,250లకు.. ప్రస్తుతం రూ.2,750 చేసింది. జనవరి నుంచి రూ.3వేలకు చేరనుంది. వైఎస్‌ఆర్ చేయూత కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు రూ.666.50 కోట్ల ప్రయోజనం కలిగింది. వైఎస్‌ఆర్ ఆసరా కింద రూ.రూ.272.80 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. ఈ మొత్తం మహిళల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. 2019 నుంచి ఇప్పటి వరకు రూ.2,423.58 కోట్ల లింకేజీ రుణాలు మంజూరయ్యాయి.

నాలుగేళ్లలో మహిళా సంక్షేమానికి అందించిన ఆర్థిక సహాయం

పథకం	లబ్ధి పొందిన మహిళలు	ఆర్థిక లబ్ధి (రూ.కోట్లలో)
వైఎస్‌ఆర్ ఆసరా	1,73,227	272.80
వైఎస్‌ఆర్ చేయూత	1,24,045	666.50
సున్నా వడ్డీ రుణాలు	29,520(గ్రూపులు)	140.36
బ్యాంక్ లింకేజీ రుణాలు	23,106(గ్రూపులు)	2,423.58
వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక	2,36,199	3,374.91
వైఎస్‌ఆర్ బీమా	3,035	25.30
జగనన్న తోడు	70,739	71.66
మొత్తం	6,59,871	6,975.11



కర్నూలు మద్దూర్‌నగర్‌లోని డ్వాక్రా బజార్

చెక్క, గానుగ నూనెల తయారీ

నగరంలోని వెంకటరమణ కాలనీలో పీఎంఎఫ్ ఎంఈ కింద రూ.4,01,500 వ్యయంతో 2022 మార్చి నెలలో శ్రీ సాత్విక గ్రామీణ చెక్క, గానుగ నూనెల తయారీ కేంద్రం ఏర్పాటు చేసుకున్నా. వేరుశనగ, నల్లనువ్వులు, తెల్లనువ్వులు, కొబ్బరి, కుసుమ, పొద్దుతిరుగుడు నూనెలను గానుగ ద్వారా తయారు చేస్తున్నా. ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుండటంతో గానుగ నూనెకు డిమాండ్ ఏర్పడింది. అన్ని ఖర్చులు పోను నెలకు రూ.30 వేల వరకు ఆదాయం వస్తోంది.

– ఊర్మిల, ఉల్చాల గ్రామం, కర్నూలు మండలం





ఇంటిల్లిపాదికీ ఉపాధి

డీఆర్‌డీఏ-వైకేపీ సిబ్బంది సూచనలతో రోటీ మేకింగ్ యూనిట్ ఏర్పాటు చేసుకున్నా. హాలహర్విలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రూ.2,74,500 లోన్ ఇచ్చింది. మరో రూ.30,500 సొంత పెట్టుబడి పెట్టాం. హోల్‌సేల్‌గా విక్రయాలు చేపడుతుండటంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. నెలకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు ఆదాయం వస్తోంది. రొట్టెల తయారీతో ఇంటిల్లిపాదికీ ఉపాధి లభిస్తోంది.

– విజయలక్ష్మి, గూళ్యం గ్రామం, హాలహర్వి మండలం

మహిళల జీవనోపాదుల అభివృద్ధికి ప్రణాళిక

- మహిళల జీవనోపాదుల అభివృద్ధికి రూ.70.30 కోట్లతో కార్యాచరణ ప్రణాళిక.
- ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద 19 మండలాల్లో 10,159 మంది మహిళల జీవనోపాదుల అభివృద్ధికి రూ.60.49 కోట్లు ఖర్చు చేయనున్నారు.
- మిగిలిన మండలాల్లో ఉన్నతి కింద 2,111 మంది మహిళలకు రూ.9.81 కోట్లతో జీవనోపాధులు కల్పించేందుకు ప్రణాళికలు సిద్ధం.
- వైఎస్‌ఆర్ చేయూత, ఆసరా, బ్యాంకు లింకేజీ రుణాలతో మహిళలు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లోనే రాణిస్తుండటం విశేషం.

మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నాం



గతంలో ఎప్పుడూ లేని విధంగా మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. మహిళలు వివిధ వ్యాపారాలు, వృత్తుల్లో విశేషంగా రాణిస్తున్నారు. కోడుమూరులో నెలకొల్పిన వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్ రాష్ట్రానికి మోడల్‌గా నలుస్తోంది. పొదుపు మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు జిల్లా సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ప్రత్యేక దుకాణం ఏర్పాటైంది. కర్నూలు మద్దూరు నగర్‌లో డ్వాక్రా బజారు నిర్వహిస్తున్నాం.

– సలీమ్ బాషా, ప్రాజెక్టు డైరెక్టర్, డీఆర్‌డీఏ-వైకేపీ

కాత్యాయనీ.. శుభప్రదాయిని

- శ్రీశైలంలో వైభవంగా దసరా నవరాత్రి ఉత్సవాలు
- కాత్యాయనీ అలంకారంలో భ్రామరి
- హంస వాహనంపై దేవదేవుల విహారం



పుష్ప పల్లకీలో ఊరేగుతున్న స్వామిఅమ్మవార్లు



ఆలయ ప్రదక్షిణలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులు



కళాకారుల ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైలంలో దసరా మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరో రోజు శుక్రవారం భ్రమరాంబాదేవి కాత్యాయనీ స్వరూపంలో దర్శనమిచ్చారు. నాలుగు చేతుల్లో అభయ ముద్ర, కమలం, ఖడ్గాన్ని ధరించి భక్తులను అమ్మవారు కటాక్షించారు. ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అలంకరించిన అమ్మవారిని ఆశీనులను చేశారు. అనంతరం ఆలయ అర్చకులు, వేదపండితులు విశేష పూజా కార్యక్రమాలను జరిపారు. కాత్యాయనీ రూపంలోని అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక నీరాజనాలు సమర్పించారు. అలంకార మండపంలో అలంకరించిన స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను హంసవాహనంపై అధిష్టింపజేసి ఆలయ అర్చకులు, వేదపండితులు విశేష పూజలు చేశారు. అనంతరం కాత్యాయనీ దేవికి, హంస వాహనంపై కొలువుదీరిన స్వామిఅమ్మవార్లకు ఆలయ ఉత్సవాన్ని జరిపారు.

నేత్రానందభరితంగా పుష్పపల్లకీ సేవ

దసరా మహోత్సవాల్లో భాగంగా స్వామిఅమ్మవార్లకు పుష్పపల్లకీసేవ జరిపించారు. వివిధ పుష్పాలతో అలంకరించిన పుష్పపల్లకీ వద్దకు మేళతాళాలతో స్వామిఅమ్మవార్లను తోడ్కొని వచ్చారు. శ్రీశైల పురవీధుల్లో అంగరంగ వైభవంగా పుష్పపల్లకీ గ్రామోత్సవం నిర్వహించారు. పూర్తి ఆధ్యాత్మిక భరితంగా సాగుతున్న ఉత్సవాలతో శ్రీగిరి మరింత అధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆయా పూజా కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఏఈవో మోహన్, ఇతర విభాగాల అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



శంఖం ఊదుతున్న సాధువు

శ్రీశైలంలో నేడు

దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం కాళరాత్రి అలంకారంలో భ్రమరాంబాదేవి, గజవాహనంపై భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

ఆపరేషన్ లేకుండా కిడ్నీలో రాళ్ల తొలగింపు

- పెద్దాసుపత్రిలో రూ.1.5కోట్లతో ఆధునిక యంత్రం
- ఇప్పటి వరకు 200 మందికి చికిత్స



కర్నూలు(హాస్పిటల్): కిడ్నీలో రాళ్లను ఆపరేషన్ లేకుండా తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆధునిక యంత్రాన్ని సమకూర్చింది. గత సంవత్సరం రూ.1.5కోట్ల ఖర్చుతో ఈఎస్‌డబ్ల్యుఎల్ మిషన్‌ను ఆసుపత్రిలోని యురాలజి విభాగానికి అందజేసింది. ఇప్పటి వరకు 200 మంది రోగులకు కిడ్నీలో రాళ్లను ఆపరేషన్, ఎలాంటి అనెస్తీషియా లేకుండానే వైద్యులు తొలగించారు. దీంతో పాటు రోగిని అదేరోజు ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసే వెసలుబాటు సైతం ఈ మిషన్ వల్ల కలుగుతోంది. ఈ మిషన్ ద్వారా నిర్వహించిన కేసుల వివరాలను ఇటీవల దుబాయిలో నిర్వహించిన అంతర్జాతీయ యురాలజి కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సేపూరి బాలరవితేజ వివరించారు. ఇందుకు ఆయన ప్రశంసలను సైతం అందుకున్నారు.

బస్సు యాత్రపై నేడు సన్నాహక సమావేశం

కర్నూలు(రాజ్‌విహార్): నంద్యాల పట్టణంలోని నూనెపల్లె బ్రిడ్జి పక్కనే ఉన్న ఉదయానంద రెసిడెన్సీలో శనివారం ఉదయం 10 గంటలకు 'సామాజిక న్యాయ బస్సు యాత్ర' సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు. ఈ నెల 26 నుంచి 'సామాజిక న్యాయ బస్సు యాత్ర' నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నంద్యాలలో ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సమావేశానికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నంద్యాల, కర్నూలు జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు ఎబీ అంజాద్ బాషా, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లాల 14 మంది ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు, పరిశీలకులు, కేడీసీసీ, డీసీఎంఎస్ చైర్మన్లు, మాజీ ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరు కానున్నారు. బస్సు యాత్రను జయప్రదం చేసే అంశంపై పార్టీ పెద్దలు దిశానిర్దేశం చేయనున్నట్లు పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య తెలిపారు.



జీవితాన్ని మోస్తూ.. ప్రేమను పంచుతూ!

నవ మాసాలు మోయడమే కాదు.. తల్లి తన బిడ్డను జీవితాంతం కంటికి రెప్పలా కాపాడుతుంది. బిడ్డ ఏడిస్తే ఆమె కంట్లో కన్నీటి సుడి కనిపిస్తుంది. నవ్వితే.. ముఖంలో కోటి కాంతులు విరజిమ్ముతుంది. అందుకే అంటారు అమ్మను మించి దైవమున్నదా అని. ఈ ఫొటోను చూస్తే తల్లి ప్రేమ ఇట్టే అర్థమవుతుంది. బతుకు పోరులో మండుటెండకు ఎదురొడ్డి సాగుతూ, చంకలోని బిడ్డపై ప్రేమామృతం కురిపిస్తోంది. కాలి నడకన రహదారి చుట్టు పక్క వ్యర్థాలను ఏరుతూ, వాటన్నింటినీ ఓ సంచిలో నెత్తిన మోస్తూ గుజిరీకి తీసుకెళ్తున్న దృశ్యం నగర శివారు జి.పుల్లారెడ్డి కాలేజీ సమీపంలో కనిపించింది. కష్టం వచ్చిందని.. బతుకు భారమైందని.. రేపు ఏమవుతుందోననే ప్రశ్నలతో ఉన్న చోట ఉండిపోయే వాళ్లకు ఈ తల్లి ఓ జవాబుగా నిలుస్తోంది. ఆమె జీవనం కొత్త పాఠం నేర్పుతోంది.

– డి.హుస్సేన్, సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

అలంపూర్ జోగులాంబకు పట్టు వస్త్రాలు సమర్పణ

- కుటుంబ సమేతంగా కలెక్టర్ సృజన ప్రత్యేక పూజలు

కర్నూలు(సెంట్రల్): అలంపూర్ జోగులాంబ అమ్మవారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పట్టు వస్త్రాలు సమర్పించారు. యేటా దసరా నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. అందులో భాగంగా శుక్రవారం మూలా నక్షత్రంలో కలెక్టర్ డాక్టర్ జి.సృజన కుటుంబ సమేతంగా శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయానికి చేరుకోగా దేవస్థానం చైర్మన్ చిన్ని కృష్ణ, ఈఓ పురేందర్‌కుమార్, కర్నూలు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. తొలుత శ్రీబాల బ్రహ్మేశ్వర స్వామికి అభిషేకం చేయించారు. అనంతరం జోగులాంబ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించగా.. ఆలయ అర్చకులు ఆశీర్వచనం ఇచ్చి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం కలెక్టర్ దంపతులతో పాటు కుటుంబ సభ్యులు స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవంలో పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలను తీసుకెళ్తున్న కలెక్టర్ డాక్టర్ సృజన దంపతులు

గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా


బోల్తా పడ్డ గ్యాస్ సిలాండర్ల లారీ

పాణ్యం: కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా పడింది. ఎస్‌ఐ అశోక్ తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు నుంచి 483 సిలిండర్ల లోడ్‌తో కనిగిరికి బయలుదేరిన లారీ పాణ్యం సమీపంలో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. గ్యాస్ సిలిండర్లు కావడంతో వాహనదారులు భయాందోళన చెందారు. అయితే లారీకి గ్రిల్ ఉండటంతో ఒక్క సిలిండర్ కూడా రహదారిపై పడలేదు. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అమీర్‌బాషకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. విషయం తెలుసుకున్న హైవే పెట్రోల్ సిబ్బంది ప్రమాద స్థలానికి చేరుకుని హైవేపై లారీని తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య విద్యార్థులు


ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రొఫెసర్లు


మెడికల్ కోట్లు అందజేస్తున్న దృశ్యం


ఫొటోలు తీసుకుంటూ..




సంప్రదాయ నృత్య ప్రదర్శన

నయా జోష్

వారంతా కాబోయే వైద్యులు. వైద్య విద్యను అభ్యసించేందుకు కొత్తగా కర్నూలు మెడికల్ కాలేజీలో అడుగు పెట్టారు. వీరిలో ఉన్న భయాన్ని పోగొట్టేందుకు, కాలేజీలో ఉన్న వాతావరణాన్ని పరిచయం చేసేందుకు శుక్రవారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలతో వేదిక ఉత్సాహంగా ఉల్లాసంగా కొనసాగింది. పాశ్చాత్య, జానపద నృత్యాలతో వైద్య విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ కర్నూలు మెడికల్ కాలేజీ గొప్పతనాన్ని వివరించారు. ఎంతో మంది పూర్వ విద్యార్థులు ఇక్కడ చదివి దేశ విదేశాల్లో ప్రముఖ వైద్యులుగా కొనసాగుతున్నారని చెప్పారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని, తోటి విద్యార్థులను సోదరభావంతో చూడాలని, వారికి ఇంటిపై ఉన్న బెంగను తొలగించి ధైర్యం నూరిపోయాలని చెప్పారు. అనంతరం వైద్య విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించా రు. ఆ తర్వాత వారికి ఐడీ కార్డు, వైట్ కోట్‌లను ప్రదానం చేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రొఫెసర్ భరణికుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ చిట్టి నర్సమ్మ, డాక్టర్ హరిచరణ్, డాక్టర్ సాయిసుధీర్, హెచ్‌వోడీలు పాల్గొన్నారు. – కర్నూలు(హాస్పిటల్)


సెల్‌ఫోన్లలో జ్ఞాపకాలను బంధిస్తూ..




డాన్స్ చేస్తున్న విద్యార్థులు


వైద్య విద్యార్థుల ఆనంద హేల

కిడ్నీరోగికి అరుదైన ఆపరేషన్


ఆపరేషన్ చేయించుకున్న అబ్దుల్ నజీర్‌తో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కిడ్నీజబ్బుతో బాధపడుతున్న ఓ వ్యక్తికి యురాలజీ విభాగం వైద్యులు అరుదైన ఆపరేషన్ చేసి ప్రాణం నిలిపారు. కర్నూలు నగరానికి చెందిన అబ్దుల్ నజీర్(57) మూత్రాశయంలో క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. ఆయనకు గుండె సమస్య వల్ల హార్ట్ పంపింగ్ 36 శాతం, హిమోగ్లోబిన్ 6.5 గ్రాములు ఉండటంతో పాటు కిడ్నీ సమస్య వల్ల క్రియాటినిన్ 4.2గా ఉంది. చికిత్స కోసం ఆయన కర్నూలులోని పలు ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రులతో పాటు హైదరాబాద్‌లోని బసవతారకం, నిమ్స్ ఆసుపత్రుల చుట్టూ తిరిగాడు. ఎక్కడా అతని ఆరోగ్య పరిస్థితి చూసి ఆపరేషన్ చేసేందుకు వైద్యులు ముందుకు రాలేదు. దీంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని యురాలజీ విభాగం వైద్యులను సంప్రదించారు. అతన్ని వార్డులో చేర్చుకున్న వైద్యులు ఎంతో రిస్క్ ఉన్నా అన్ని జాగ్రత్తలు తీసుకుని గత నెల 7వ తేదీన ఏడు గంటల పాటు శ్రమించి ఆపరేషన్ చేశారు. అతను కోలుకోవడంతో అదే నెల 21న డిశ్చార్జ్ చేశారు. శుక్రవారం అతను చికిత్స కోసం మళ్లీ రావడంతో వివరాలను యురాలజీ విభాగాధిపతి డాక్టర్ సీతారామయ్య విలేకరులకు వివరించారు. ఆపరేషన్‌లో తనతో పాటు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ముత్యశ్రీ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బాలరవితేజ, డాక్టర్ రాజారెడ్డి, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ వెంకటమనేష్ నాయక్, అనెస్తీషియా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీలత నిర్వహించినట్లు ఆయన వివరించారు. ఎంతో రిస్క్‌తో కూడిన ఆపరేషన్‌ను విజయవంతం చేసినందుకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి, మెడికల్ కాలేజి ప్రిన్సిపల్ డాక్టర్ పి. సుధాకర్ వైద్యుల బృందాన్ని అభినందించారు.

దొంగకు ఏడాది జైలు శిక్ష

ఆళ్లగడ్డ: చోరీ కేసులో నేరం రుజువు కావడంతో దొంగకు ఏడాది జైలు శిక్ష విధించినట్లు రూరల్ ఎస్‌ఐ నరసింహులు శుక్రవారం తెలిపారు. 2017 సెప్టెంబర్ 3వ తేదీన బత్తలూరు గ్రామానికి చెందిన అవుకు ఓబులేసు ఇంట్లో చోరీ జరిగింది. రూ. 2 లక్షల నగదు, 9.5 తులాల బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. ఈ కేసుకు సంబంధించి కేసు నమోదు చేసుకున్న రూరల్ పోలీసులు విచారించి అబ్దుల్ సుభాన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా ఈ కేసు విచారించిన కర్నూలు జువినైల్ జస్టిస్ బోర్డు కోర్టు నేరం రుజువు కావడంతో అబ్దుల్ సుభాన్‌కు ఏడాది జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానంతోనే హత్యాయత్నం

- నిందితుడి నుంచి నాటు తుపాకీ, ఐదు సీసపు గుండ్లు స్వాధీనం

ఆళ్లగడ్డ: ఐదు రోజుల క్రితం అహోబిలంలో నాటు తుపాకీతో హత్యాతయ్నానికి పాల్పడిన కేసును పోలీసులు ఛేదించారు. భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో ఓ వ్యక్తిని నాటు తుపాకీతో చంపేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో తేలింది. హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడు కాకి రామాంజనేయులును శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ హనుమంత్ నాయక్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. అహోబిలం గ్రామం చెంచుకాలనీకి చెందిన కాకి రామాంజనేయులు అదే కాలనీకి చెందిన అన్న వరుస అయ్యే మోకుల నరసింహ తన భార్యతో అక్రమ సంబంధం పెట్టుకున్నాడని అనుమానం పెంచుకుని అంతమొందించాలని కుట్ర పన్నాడు. రామాంజనేయులు ఈ నెల 15వ తేదీ నరసింహ మరో యువకుడితో కలిసి అడవికి తేనె సేకరించుకునేందుకు వెళ్లి తిరిగి వస్తుండగా అడవి దారిలో కాపు కాచాడు. ఎదురుగా వస్తున్న నరసింహపై నాటు తుపాకీతో కాల్చగా గురి తప్పి పక్కనున్న యువకుడు పెద్దన్నకు సీసం గుండు తగిలి గాయపడ్డాడు. బాధితుడు పెద్దన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. శుక్రవారం పెద్ద కందుకూరు మెట్ట సమీపంలో రామాంజనేయులు ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అహోబిలం కాశినాయన ఆశ్రమం సమీపంలో దాచి ఉంచిన నాటు తుపాకీ, ఐదు సీసపు గుండ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు. నిందితుడి అరెస్ట్ చేసిన ఎస్‌ఐ నరసింహులు, సిబ్బంది సురేష్‌రెడ్డి, నాగరాజు, ప్రతా ప్, రాధాకృష్ణను ఎస్పీ రఘువీర్ రెడ్డి అభినందిచినట్లు సీఐ తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న సీఐ హనుమంత్ నాయక్

బెట్టింగ్ రాయుళ్ల 'ఆట'కట్టు

- ముగ్గురు ఆన్‌లైన్ బెట్టింగ్ రాయుళ్ల అరెస్ట్
- రూ.8,25,000 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ శివనారాయణస్వామి


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోనిఅర్బన్: వరల్డ్ కప్ సీజన్‌లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురిని ఆదోని త్రీటౌన్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి రూ.8,25,000 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరికొంత మంది పరారీలో ఉన్నారని, వారిని త్వరలో పట్టుకుంటామని డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఆయన వివరాలను వెల్లడించారు. గురువారం ఇండియా, బంగ్లాదేశ్ మధ్య మ్యాచ్ ఉండటంతో ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ సాగుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు త్రీటౌన్ సీఐ నరసింహరాజు, పెద్ద తుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య, కానిస్టేబుళ్లు లక్ష్మన్నస్వామి, నరేంద్ర, రాజశేఖర్, కాశీంవలీ, గిరిబాబు, ఇస్మాయిల్ బృందంగా ఏర్పడి ఆదోని పట్టణం ఎమ్మిగనూరు బైపాస్ రోడ్డు వద్ద ఉన్న వికాస్ దాబా వెనక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్న మసీదాపురకు చెందిన ఇస్మాయిల్‌బాషా, ఎల్‌బీ స్ట్రీట్‌కు చెందిన శివమూర్తి, పింజారి గేరికి చెందిన ఉసేనిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.8,25,000 నగదు, ఎనిమిది సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. బెట్టింగ్ నిర్వాహకుల్లో ముఖ్యమైన హైదరాబాద్‌కు చెందిన ఇస్మాయిల్, ఐజకు చెందిన వడ్ల రాఘవేంద్ర ఆచారిలను కూడా త్వరలోనే పట్టుకుంటామని డీఎస్పీ తెలియజేశారు.

ఎలా బెట్టింగ్ చేస్తారంటే..

హైదరాబాద్‌కు చెందిన ఇస్మాయిల్‌బాషా ఒక యాప్‌ను తయారు చేసి, ఆయనకు సంబంధించిన ఏజెంట్లకు పంపిస్తారు. ఆ ఏజెంట్లు ఒక టీంను తయారు చేసి ఎవరైతే క్రికెట్ ఆడతారో వారికే ఫోన్‌లో యాప్‌ను పంపిస్తారు. దీంతో ఆన్‌లైన్‌లో క్రికెట్ చూసుకుంటూ ఈ వరల్డ్‌కప్ సీజన్‌లో కేవలం గెలుపు, ఓటములపై 1:2, 1:5 బెట్టింగ్ నిర్వహించి లావాదేవీలను ఫోన్‌పే ద్వారానే జరుపుతారని డీఎస్పీ తెలియజేశారు. బెట్టింగ్ నిర్వాహకుడు ఇస్మాయిల్‌బాషా కింద ఉన్న ఒక బృందంలో ఐజకు చెందిన వడ్ల రాఘవేంద్ర ఆచారి ఉన్నారని తెలిపారు. ఈయన కింద ఆదోని పట్టణంలో కొందరని టీంగా తయారు చేసుకొని బెట్టింగ్ వ్యవహారం నడుపుతున్నట్లు డీఎస్పీ తెలిపారు. సీజన్‌లో రూ.కోటి పైనే లావాదేవీలు జరిగాయనే అంచనా ఉందన్నారు. ఆన్‌లైన్ బెట్టింగ్ పేరుతో మోసం జరుగుతోందని, యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

క్లుప్తంగా

మార్కెట్‌యార్డుకు వరుస సెలవులు

నంద్యాల(సెంట్రల్): విజయదశమి పర్వదినం సందర్భంగా నంద్యాల మార్కెట్‌యార్డుకు వరుస సెలవులు వచ్చాయి. శని, ఆదివారాలు సాధారాణ సెలవులు ఉండటంతో పాటు దసరా పర్వదినం సందర్భంగా సోమ, మంగళ వారాలు రాష్ట్ర ప్రభుత్వం మిర్చి యార్డుకు సెలవులు ప్రకటించిందని మార్కెట్‌యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి కల్పన తెలిపారు. ఈనెల 25వ తేదీ బుధవారం నుంచి యార్డులో యథావిధిగా క్రయవిక్రయాలు కొనసాగుతాయని వెల్లడించారు. రైతులు సెలవు రోజుల్లో యార్డుకు మిర్చి బస్తాలు తీసుకొని రావద్దని ఆమె విజ్ఞప్తి చేశారు.

మహిళలను గౌరవిద్దాం


జూమ్ కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ-వైకేపీ పీడీ సలీమ్‌బాషా, డీపీఎంలు, ఏపీఎంలు

కర్నూలు(అగ్రికల్చర్): డీఆర్‌డీఏ-వైకేపీ కార్యాలయాల్లో మహిళల పట్ల గౌరవంగా మెలగాలని సెర్ప్ మానవ వనరుల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, ఎన్‌ఆర్‌ఎంఎం నేషనల్ రిసోర్స్ పర్సన్ అనురాధ అన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వైకేపీ కార్యాలయాల్లో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ అనే అంశంపై శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యాలయాల్లో ప్రతి ఒక్కరినీ అక్కాచెల్లెళ్లుగానే చూడాలన్నారు. మహిళలను లైంగికంగా వేధింపులకు గురి చేస్తే తగిన చర్యలు తప్పవనే విషయం గుర్తించాలన్నారు. అన్ని కార్యాలయాల్లో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలని, నేరుగా చెప్పుకోలేని వారు తమ వేదనను రాతపూర్వకంగా ఈ బాక్స్‌లో వేయవచ్చన్నారు. వీటిపై వెంటనే స్పందిస్తామన్నారు. జూమ్‌లో డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీమ్‌బాషా, డీపీఎంలు నరసమ్మ, అయ్యమ్మ, ఏపీఎంలు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాపర్ల అరెస్ట్

గత జూన్‌లో బనగానపల్లి క్రషర్ వ్యాపారి కిడ్నాప్

- రూ.4 కోట్లు తీసుకుని వ్యాపారితో పాటు కుమారుడి విడుదల
- మాజీ డ్రైవర్‌తో పాటు మరికొందరి హస్తం
- అప్పట్లో 11 మంది అరెస్టు
- తాజాగా ప్రధాన నిందితుడు సహా ముగ్గురి అరెస్టు
- రెండు విడతల్లో రూ.3.6 కోట్లు స్వాధీనం


ప్రధాన సూత్రధారుల అరెస్ట్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: జేసీబీ డ్రైవర్ ఏకంగా తన యజమానినే కిడ్నాప్ చేసి రూ.4కోట్లతో ఉడాయించిన ఘటన గత జూన్‌లో కలకలం రేపింది. ఈ కేసుకు సంబంధించి గతంలో 11 మందిని అరెస్టు చేయగా, ప్రస్తుతం ప్రధాన నిందితుడు సహా ముగ్గురిని అరెస్టు చేశారు. వీరి నుంచి రెండు విడతల్లో రూ.3.6 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బనగానపల్లి పట్టణానికి చెందిన వినాయకరెడ్డి క్రషర్ వ్యాపారం చేస్తూ ఉమ్మడి జిల్లాలో పారిశ్రామికవేత్తగా పేరు గడించాడు. అనంతపురం జిల్లా పెద్దవడుగూరు గ్రామానికి చెందిన నరేష్ ఇతని వద్ద గత నాలుగేళ్లుగా జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అయితే క్రమంగా ప్రవర్తనలో మార్పు కనిపించడంతో వినయకరెడ్డి అతడిని తొలగించాడు. ఇది మనసులో పెట్టుకున్న నరేష్ అతన్ని కిడ్నాప్ చేసి కోట్లు రాబట్టేందుకు పథకం వేశాడు. అందులో భాగంగా కర్ణాటక రాష్ట్రంలోని కోలార్‌కు చెందిన సురేష్, శ్రీనివాస్, ఖలందర్, అజయ్, విజయ్, భార్గవ్, ప్రభు, ప్రకాష్, రంజిత్.. అనంతపురం జిల్లాకు చెందిన రవికుమార్, రంజిత్ కుమార్, చెన్నా భాస్కర్, రఘులతో కిడ్నాప్‌నకు తెరలేపారు. అందరూ కలిసి గత జూన్ 3న బనగానపల్లిలో రెక్కీ నిర్వహించారు. 5వ తేదీ ఉదయం బనగానపల్లి నుంచి బేతంచర్లకు వినాయకరెడ్డితో పాటు ఆయన కుమారుడు భరత్‌కుమార్‌రెడ్డి డ్రైవర్‌తో కలిసి కారులో బయలుదేరారు. అదే సమయంలో కిడ్నాపర్లు నాలుగు కార్లలో వెంబడించి సీతారామాపురం మెట్ట వద్ద అడ్డగించారు. కత్తిని చూపించి భరత్‌కుమార్‌రెడ్డి, వినాయకరెడ్డిలను కిందకు దించారు. వారిని కిడ్నాపర్ల కారులో ఎక్కిస్తుండగా డ్రైవర్ సాయినాథ్‌రెడ్డి అడ్డుకున్నారు. కిడ్నాపర్లు తండ్రీ కొడుకులతో పాటు డ్రైవర్‌ను కూడా కారులోకి కుక్కి ఎత్తుకెళ్లారు. ఆ తర్వాత వినాయకరెడ్డి తండ్రి నాగిరెడ్డికి ఫోన్ చేసి రూ.4 కోట్లు ఇవ్వాలని, లేకుంటే వాళ్లను చంపుతామని బెదిరించారు. భయపడిన నాగిరెడ్డి బంధువుల వద్ద డబ్బు తీసుకుని మొదటగా అనంతపురం జిల్లా కొత్తపల్లి వద్ద రూ.2 కోట్లు.. ఆ తర్వాత కర్ణాటక రాష్ట్రంలోని కోలార్ వద్ద రూ.2 కోట్లు ముట్టజెప్పాడు. దీంతో కిడ్నాపర్లు 7వ తేదీన కర్ణాటక రాష్ట్రంలో ముగ్గురినీ విడిచిపెట్టారు. అయితే కిడ్నాపర్లు డబ్బు తీసుకొని కూడా తమ కుమారుడిని, మనవడిని వదిలిపెట్టరేమోనన్న ఆందోళనతో నాగిరెడ్డి జరిగిన విషయాన్ని బేతంచర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

రంగంలోకి దిగిన పోలీసులు

ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు తమదైన శైలిలో విచారణ కొనసాగించారు. ఇంతలోనే కిడ్నాప్‌నకు గురైన ముగ్గురూ ఇంటికి చేరుకున్నారు. అయితే పోలీసులు జూన్ 30న గుత్తి పట్టణంలో 11 మందిని అరెస్ట్ చేసి రూ.40 లక్షల నగదు, కత్తి, మూడు సెల్‌ఫోన్‌లు, నాలుగు కార్లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న కిడ్నాప్ ప్రధాన నిందితుడు నరేష్, చెన్నా భాస్కర్, రఘులను శుక్రవారం వేకువజామున అనంతపురం జిల్లా గుత్తి వద్ద అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.2.66 కోట్లు నగదు, రెండు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. గతంలో స్వాధీనం చేసుకున్న నగదుతో కలిపి మొత్తం రూ.3.6 కోట్లు రికవరీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన అడిషనల్ ఎస్పీ వెంకటరాముడుతో పాటు డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, సీఐ ప్రియతమ్‌రెడ్డి, ఎస్‌ఐలు శివశంకర్, నాయక్, రాకేష్, నరేష్, జగదీశ్వరరెడ్డి, రమేష్ రెడ్డి, హరినాథ్‌రెడ్డి, పీఆర్‌ఓ చెన్నయ్యలను ఎస్పీ అభినందించారు.

సినిమా

సినిమా తర్వాత సినిమా... ఒకేసారి రెండు లేక మూడు సినిమాలు చేసే హీరోయిన్లు హఠాత్తుగా కొత్త సినిమా సైన్ చేయకపోతే? 'వాట్ నెక్స్ట్' అనే ప్రశ్న ఎదురవుతుంది. ఆ నాయికలు ఇతర భాషల్లో సినిమాలు చేస్తున్నప్పటికీ డైరీలో తెలుగు సినిమా లేకపోవడం ఫ్యాన్స్‌ని నిరుత్సాహ పరిచే విషయం. ప్రస్తుతం తెలుగులో సినిమా సైన్ చేయని నాయికల గురించి తెలుసుకుందాం.


● అనుష్క ● రకుల్ ● కృతీ శెట్టి ● సమంత

వాట్ నెక్స్ట్

గ్యాప్ లేకుండా...

అటు కమర్షియల్ చిత్రాల్లో హీరోయిన్‌గా, ఇటు లేడీ ఓరియంటెడ్ చిత్రాలతో ఆకట్టుకున్న అనుష్క జోరు గతంతో పోలిస్తే ప్రస్తుతం తగ్గిందనే చెప్పాలి. ఏడాదికి ఐదారు తెలుగు సినిమాలు చేసిన ఆమె ప్రస్తుతం ఏడాదికి ఒక్క సినిమాతోనే సరిపెట్టుకుంటున్నారు. 2021, 2022లో అయితే అనుష్క కనీసం ఒక్క తెలుగు సినిమాలోనూ నటించలేదు. ఈ ఏడాది నవీన్ పొలిశెట్టి, అనుష్క జంటగా నటించిన 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' సెప్టెంబర్ 7న విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇక నాన్‌స్టాప్‌గా సినిమాలు చేస్తానని, తెలుగులో గ్యాప్ లేకుండా ప్రాజెక్ట్స్ కమిట్ అవుతానని అన్నారు అనుష్క. ప్రస్తుతం 'కథనార్– ది వైల్డ్ సోర్సెరర్' చిత్రంతో మలయాళ ఇండస్ట్రీలో అడుగు పెడుతున్నారు. అయితే తెలుగులో కొత్త సినిమా ఏదీ సైన్ చేయలేదు.

సంవత్సరం విరామం

దక్షిణాదిలో స్టార్ హీరోయిన్‌గా దూసుకెళుతున్న సమంత సంవత్సరం పాటు సినిమాలకు గ్యాప్ ఇచ్చిన విషయం తెలిసిందే. 'మయోసైటిస్' వ్యాధి బారిన పడిన ఆమె కొన్నాళ్ల పాటు షూటింగ్స్‌కి దూరంగా ఉంటూ చికిత్స తీసుకుని సినిమాలు చేశారు. ఇక సమంత ఫుల్ స్పీడ్‌తో సినిమాలు చేస్తారని ఆశించిన ఆమె అభిమానుల ఆనందం ఆవిరి అయ్యేట్లు ఏడాది పాటు తాను సినిమాలకు గ్యాప్ ఇస్తున్నట్లు ప్రకటించారు సమంత. మయోసైటిస్ పూర్తి స్థాయి చికిత్స కోసమే సమంత ఈ బ్రేక్ తీసుకున్నారనే వార్తలు వస్తున్నాయి. కాగా విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన 'ఖుషి' చిత్రం సెప్టెంబరు 1న విడుదలై, మంచి హిట్‌గా నిలిచింది. 'ఖుషి' వంటి హిట్ మూవీ తర్వాత సమంత నటించనున్న తెలుగు సినిమా ఏంటి? అన్నదానిపై ఎలాంటి స్పష్టత లేదు. ఇకపోతే హిందీలో సమంత లీడ్ రోల్‌లో నటించిన 'సిటాడెల్' వెబ్ సిరీస్, 'చెన్నయ్ స్టోరీస్' (ఇంగ్లీష్–తమిళ్) చిత్రం విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

రెండేళ్లు గ్యాప్

సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగారు రకుల్ ప్రీత్‌సింగ్. తెలుగులో వరుస చిత్రాలతో తన సత్తా చాటిన ఈ బ్యూటీ రెండేళ్లుగా ఒక్క తెలుగు సినిమా కూడా చేయకపోవడం విశేషం. క్రిష్ దర్శకత్వం వహించిన 'కొండపొలం' చిత్రంలో నటించారు రకుల్. 2021 అక్టోబర్ 8న ఆ సినిమా విడుదలైంది. ఆ తర్వాత మరో తెలుగు సినిమా చేయలేదు రకుల్. బాలీవుడ్‌కి పరిమితమై వరుసగా హిందీ సినిమాలు చేస్తున్నారామె. ప్రస్తుతం ఆమె బాలీవుడ్‌లో 'ఐ లవ్ యు', 'మేరీ పత్నీ కా రీమేక్' చిత్రాలతో పాటు తమిళంలో 'ఆయలాన్, ఇండియన్ 2' చిత్రాలు చేస్తున్నారు. అయితే రెండేళ్లుగా కనీసం ఒక్క తెలుగు సినిమా కూడా చేయకపోవడంతో ఆమె ఫ్యాన్స్ నిరుత్సాహపడుతున్నారు. కనీసం వచ్చే ఏడాది అయినా ఈ బ్యూటీ తెలుగులో తన జోరు చూపిస్తారేమో చూడాలి.

కొత్త సినిమా ఎప్పుడు?

తెలుగు పరిశ్రమలోకి 'ఉప్పెన'లా దూసుకొచ్చారు కృతీ శెట్టి. తొలి సినిమా 'ఉప్పెన '(2021) తో బేబమ్మగా తెలుగు ప్రేక్షకుల మనసులను దోచారీ బ్యూటీ. గత ఏడాది (2022) కృతీ శెట్టి నటించిన 'బంగార్రాజు, ది వారియర్, మాచర్ల నియోజకవర్గం, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి' సినిమాలు రిలీజయ్యాయి. ఈ ఏడాది ఆమె నటించిన తెలుగు చిత్రం 'కస్టడీ' ఒక్కటే రిలీజ్ అయింది. ఆ చిత్రం విడుదలై ఆర్నెల్లు దాటినా మరో తెలుగు సినిమా సైన్ చేయలేదు కృతి. తెలుగులో మోస్ట్ హ్యాపెనింగ్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం మలయాళంలో 'అజయంతే రండం మోషణం', తమిళంలో 'జెనీ' సినిమాలు చేస్తున్నారు. మరి.. కృతీ డైరీలో కొత్త తెలుగు సినిమా చేరేది ఎప్పుడు?

ఈ ఏడాది 'దసరా, భోళా శంకర్' సినిమాలతో ప్రేక్షకులను అలరించారు కీర్తీ సురేశ్. ఆ చిత్రాల తర్వాత మరో తెలుగు సినిమా అంగీకరించని కీర్తి తమిళంలో నాలుగు సినిమాలు చేస్తున్నారు. ఆమె నటించనున్న తదుపరి తెలుగు సినిమా ఏంటి? అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. అదే విధంగా గత ఏడాది విడుదలైన 'ఆచార్య' సినిమా తర్వాత మరో తెలుగు సినిమా ఒప్పుకోలేదు పూజా హెగ్డే. మహేశ్‌బాబు 'గుంటూరు కారం'లో హీరోయిన్‌గా ఎంపికైనా ఎందుకనో ఆ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారీ బ్యూటీ. అలాగే 'నన్ను దోచుకుందువటే' (2018) సినిమాతో టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన నభా నటేశ్ ఆ తర్వాత వరుసగా తెలుగు చిత్రాలు చేశారు. అయితే 'మాస్ట్రో' (2021) తర్వాత ఇప్పటివరకూ ఆమె మరో తెలుగు సినిమాపై ఎలాంటి సమాచారం లేదు. అదే విధంగా మెహరీన్, నిధీ అగర్వాల్, అనూ ఇమ్మాన్యుయేల్ వంటి హీరోయిన్ల జోరు కూడా తెలుగులో తగ్గింది. మెహరీన్ ఈ ఏడాది 'స్పార్క్' (తెలుగు–తమిళ్) లో నటిస్తున్నారు. ఆ తర్వాత ఆమె నటించే తెలుగు సినిమాపై క్లారిటీ లేదు. అలాగే ఈ ఏడాది ఏప్రిల్‌లో రిలీజైన 'రావణాసుర' చిత్రం తర్వాత అనూ ఇమ్మాన్యుయేల్ ఏ తెలుగు సినిమాలోనూ నటించడం లేదు. అలాగే నిధీ అగర్వాల్ చేతిలోనూ 'హరి హర వీరమల్లు' మినహా మరో తెలుగు సినిమా లేదు. ఈ సినిమా ఎప్పుడో ఒప్పుకున్నారామె. అయితే షూటింగ్ ఆలస్యం అవుతోంది. ఈ చిత్రం తర్వాత వేరే ఏ తెలుగు సినిమా కూడా ఆమె కమిట్ కాలేదు.


● కీర్తీ సురేశ్ ● పూజా హెగ్డే ● నభా నటేశ్ ● నిధీ అగర్వాల్ ● మెహరీన్ ● అనూ ఇమ్మాన్యుయేల్


● అశోక్ వర్ధన్, సునీల్ బలుసు, విజయశాంతి, కల్యాణ్ రామ్, సయీ మంజ్రేకర్, ప్రదీప్ చిలుకూరి

కొత్త సినిమా షురూ

కల్యాణ్ రామ్ హీరోగా కొత్త సినిమాకి కొబ్బరికాయ కొట్టారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సయీ మంజ్రేకర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. నటి విజయశాంతి కీలక పాత్ర పోషిస్తున్నారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్‌పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్న ఈ సినిమా శుక్రవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి మురళీ మోహన్ కెమెరా స్విచ్చాన్ చేయగా, విజయశాంతి క్లాప్ కొట్టారు. ముప్పా వెంకయ్య చౌదరి స్క్రిప్ట్‌ని దర్శకునికి అందించారు. ''భారీ బడ్జెట్, అత్యున్నత సాంకేతిక విలువలతో రూపొందుతున్న చిత్రమిది. కల్యాణ్ రామ్ పాత్ర చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఆయన కెరీర్‌లో ఈ సినిమా ఓ మైలురాయిగా నిలిచిపోతుంది. త్వరలోనే ఇతర నటీనటులు, పూర్తి వివరాలను తెలియజేస్తాం'' అన్నారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: బి. అజనీష్ లోక్‌నాథ్, కెమెరా: సి. రామ్ ప్రసాద్.

అనుకున్నవన్నీ జరగవు


● 'అల్లరి' నరేశ్, శ్రీరామ్

శ్రీరామ్ నిమ్మల, కలపాల మౌనిక జంటగా నటించిన చిత్రం 'అనుకున్నవన్నీ జరగవు కొన్ని'. జి. సందీప్ దర్శకత్వంలో శ్రీ భరత్ ఆర్ట్స్ సంస్థ నిర్మించిన ఈ చిత్రం నవంబర్ 3న రిలీజ్ కానుంది. ఈ చిత్రం పోస్టర్‌ను హీరో 'అల్లరి' నరేశ్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''పోస్టర్ ఆసక్తికరంగా ఉంది. నేను నటించిన 'సిల్లీ ఫెలోస్' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేసిన సందీప్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవడం ఆనందంగా ఉంది'' అన్నారు. జి. సందీప్ మాట్లాడుతూ– ''క్రైమ్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రమిది. కామెడీని ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు'' అన్నారు. ''నరేశ్‌గారు క్రైమ్, కామెడీ జానర్ చిత్రాలు ఎన్నో చేశారు. మా టైటిల్ లాంచ్ చేయడానికి ఆయనే కరెక్ట్ అనిపించింది'' అన్నారు శ్రీరామ్ నిమ్మల. ఈ చిత్రానికి కెమెరా: చిన్నా రామ్, జీవీ అజయ్, సంగీతం: గిడియన్ కట్ట, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: బీవీ నవీన్.

బేబి కాంబో రిపీట్


● ఆనంద్, వైష్ణవీ చైతన్య

'బేబి' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న హీరో ఆనంద్ దేవరకొండ, హీరోయిన్ వైష్ణవీ చైతన్య కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనుంది. 'బేబి' చిత్ర దర్శకుడు సాయి రాజేశ్ ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే, మాటలు అందిస్తున్నారు. ఈ చిత్రం ద్వారా రవి నంబూరి దర్శకునిగా పరిచయం అవుతున్నారు. అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్‌పై ఎస్‌కేఎన్, సాయి రాజేశ్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ''ఈ సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది. త్వరలోనే షూటింగ్ మొదలవుతుంది. వచ్చే వేసవిలో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నాం. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: బాల్ రెడ్డి, సహనిర్మాత: ధీరజ్ మొగిలినేని.

స్థానిక వార్తలు

మద్దిలేటయ్య క్షేత్రంలో...


విద్యాలక్ష్మి అలంకారంలో అమ్మవారు

బేతంచెర్ల: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో శ్రీ మహాలక్ష్మి అమ్మవారు చదువుల తల్లి విద్యాలక్ష్మి అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. పండితులు జ్వాలాచక్రవర్తి, కళ్యాణచక్రవర్తి ఆధ్వర్యంలో 10వేల మూల మంత్ర జప హోమాదులు నిర్వహించారు. ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామ చంద్రుడు, పాలక మండలి సభ్యులు.. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు సహస్ర దీపాలంకరణ సేవలో శోభాయమానంగా వెలిగిపోయారు. అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని, సుదర్శన ఆళ్వార్లను ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు.

మహానందిలో..

మహానంది: దసరా వేడుకల్లో భాగంగా మహానందిలో అమ్మవారికి శుక్రవారం సహస్ర దీపాలంకరణ పూజలు నిర్వహించారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, మామిళ్లపల్లి అర్జునశర్మ రుద్ర, చండీహోమాలు చేపట్టారు. ఓంకారంలో ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ గంగా, ఉమా సమేత ఓంకారసిద్ధేశ్వర స్వామివార్లకు విశేష ద్రవ్యాభిషేక పూజలు చేపట్టారు. అమ్మవారిని శ్రీ సరస్వతీదేవిగా అలంకరించారు. కార్యక్రమంలో దాతలు నాగమోహన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు.


సహస్రదీపాలంకరణ పూజలు చేస్తున్న దృశ్యం

అహోబిలంలో..


తిరుమంజనం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం అహోబిలం శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ఆలయ ముఖద్వార మండపంలో కొలువుంచి పంచామృతాలతో అభిషేకించారు. ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాల మధ్య నవకళశ స్థాపన, తిరుమంజనం నిర్వహించి ధూపదీపాలతో మహా మంగళహారతి ఇచ్చారు. రాత్రి విశేష అలంకరణలో ఉభయ దేవరులతో శ్రీ ప్రహ్లాదవరదుడు పల్లకీపై కొలువుదీరి తిరువీధిల్లో విహరించారు.

అభాగ్యులకు సీఎం వైఎస్ జగన్

ఆపన్నహస్తం

● ఎమ్మిగనూరులో సీఎంను కలిసిన ఆరుగురికి రూ.లక్ష చొప్పున అర్థిక సాయం
● చెక్కులను అందజేసిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన ● సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపిన బాధితులు

కర్నూలు(సెంట్రల్): సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అభాగ్యులకు ఆపన్నహస్తం అందించారు. గురువారం ఎమ్మిగనూరుకు వచ్చిన ఆయనను తమను ఆదుకోవాలని పలువురు కలిసి విన్నవించడంతో సీఎం చలించిపోయారు. తక్షణ సాయం చేయాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజనకు ఆదేశాలు ఇచ్చారు. ఈక్రమంలో శుక్రవారం ఆమె తన కార్యాలయంలో 6గురు బాధితులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. అలాగే సీఎంను ఉద్యోగాలు అడిగిన వారికి ఉపాధి కల్పన అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.



సీఎం జగన్‌కు కృతజ్ఞతలు



మాది నిరుపేద కుటుంబం. కూలి పనులు చేసుకుంటే తప్ప కుటుంబం గడవదు. ఊపిరితిత్తుల్లో నీరు చేరి తీవ్ర వేదనకు గురి చేస్తోంది. ఆపరేషన్ చేయకపోతే బతకరని వైద్యులు చెబుతున్నారు. ఈసమయంలో జగనన్నకు కలసి నా ఆరోగ్య పరిస్థితిని వివరించా. ఆయన తక్షణ సాయంగా రూ.లక్ష ఇప్పించారు. మంచి మనసున్న సీఎంకు కృతజ్ఞతలు.

– యు.అశోక్, కామవరం, కౌతాళం



మా కుటుంబానికి ఆపన్నహస్తం



2021లో పొలం పనులకు వెళ్లిన సమయంలో జరిగిన అగ్ని ప్రమాదంలో నా కూతూరు విద్య తీవ్రంగా గాయపడింది. ఆమెకు వైద్యం చేయించడం కోసం రూ.2 లక్షలు ఖర్చు చేశాం. మా కుటుంబాన్ని ఆదుకోవాలని జగనన్నకు ఎమ్మిగనూరులో విజ్ఞప్తి చేయగా ఇప్పుడు రూ.లక్ష సాయంగా ఇచ్చారు. నా కూతురు వికలాంగ పెన్షన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు.

-కురువ రాజు, హెచ్ ఖైరవాడి, గోనెగొండ్ల మండలం



నా కుమార్తెకు కంటి ఆపరేషన్ చేయిస్తామన్నారు




ఐదేళ్ల క్రితం బ్రెయిన్ క్యాన్సర్‌తో దురదృష్టవశత్తూ రేష్మా రెండు కళ్లను కోల్పోయింది. అప్పటి నుంచి ఎన్నో ఆసుపత్రులు చుట్టూ తిరిగిన ఎవరూ నా కుమార్తెకు కళ్లు తెప్పించలేకపోయారు. ఎంతో ఖర్చు చేసుకొని అప్పుల పాలయ్యాం. ఇంతలో జగనన్న ఎమ్మిగనూరుకు రావడంతో ఆర్థిక సాయం చేయమని అడిగితే రూ.లక్ష ఇచ్చారు. మా పాపకు ఆపరేషన్ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జగనన్నరు రుణపడి ఉంటా. – షేక్ రేష్మా, ఎమ్మిగనూరు

జీవితాంతం మరువలేను



సీఎం జగనన్న చేసిన ఆర్థిక సాయాన్ని జీవితాంతం మరచిపోలేను. నేను కష్టాల్లో ఉన్న సమయంలో ఎవరూ పట్టించుకోలేదు. నేను తిరగని ఆఫీసు లేదు. కలవని అధికారి లేరు. అదే జగనన్నను కుడి కాలు ఆపరేషన్ కోసం రూ.3 లక్షల వరకు ఖర్చు చేసుకున్నానని, ఆర్థిక సాయం లేదా వికలాంగ పెన్షన్ ఇవ్వాలని ఎమ్మిగనూరు వచ్చిన సమయంలో అడిగా. తక్షణంగా సాయంగా రూ.లక్ష కలెక్టర్ మేడం ఇచ్చారు. వికలాంగ పెన్షన్‌ను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

– బి.భాస్కర్ , దైవందిన్నె, ఎమ్మిగనూరు మండలం





ఆరేళ్ల నుంచి నరకం



నేను ఆరు సంవత్సరాల నుంచి నరకం అనుభవిస్తున్నాను. కిడ్నీ, యూరిన్ బ్లాడర్ సమస్యతో తీవ్ర ఇబ్బంది పడుతున్నా. ఇందుకోసం నెలకు రూ.10 వేలు ఖర్చు అవుతుంది. నాకు కిడ్నీ వ్యాధితో బాధపడే వారికి ఇచ్చే పెన్షన్ ఇవ్వాలని సీఎంను కోరాను. అయితే తక్షణ సాయంగా రూ.లక్ష ఇచ్చారు. పెన్షన్‌ను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టరమ్మ చెప్పారు.

– డి.ఖాజావలి, పెద్దమర్రివీడు, గోనెగొండ్ల మండలం

పేదల కోసం పరితపించే ముఖ్యమంత్రి జగనన్నే



పేదల కోసం పరితపించే ముఖ్యమంత్రి జగనన్న ఒక్కరే. ఎమ్మిగనూరులో నా కూతూరు శ్రావణి మానసిక జబ్బుతో బాధపడుతోంది. సామాజిక పెన్షన్ కాకుండా వికలాంగ పెన్షన్‌ను ఇవ్వాలని కోరాను. వెంటనే కలెక్టర్ స్పందించి వైద్యం కోసం రూ.లక్షతో పాటు పెన్షన్ అంశాన్ని పరిశీలిస్తామని చెప్పడం సంతోషంగా ఉంది. – గొల్ల లక్ష్మన్న



సాక్షి
ఫ్యామిలీ
V
కర్నూలు
శనివారం ॥ 21-10-2023

న్యూస్‌మేకర్

కశ్మీర్ పేరు చెప్తే అందమైన ప్రదేశాలే గుర్తొస్తాయి.
కాని ఆ లోయలో దాగిన రుచులు
అన్వేషిస్తే తప్ప తెలియదు.
శాకాహారమైనా మాంసాహారమైనా
స్వచ్ఛమైన దినుసులతో గుమ్మెత్తిస్తారు.
'మేము ఎలా వండుతామో నా వంట చూసి
తెలుసుకోండి' అని
కశ్మీర్ వంట చేసి చూపుతోంది రుక్సార్ సయీద్.
కశ్మీర్ మహిళలు పెద్దగా పాల్గొనని
'మాస్టర్ షెఫ్ ఆఫ్ ఇండియా' తాజా సిరీస్‌కు
రుక్సార్ స్పెషల్ అట్రాక్షన్ అయ్యింది.
పోటీని తట్టుకుని టాప్ 12లో నిలిచిన ఆమెను చూసి
కశ్మీర్‌లో ఆడవాళ్లు గర్విస్తున్నారు.



రుక్సార్ సయీద్

టేస్ట్ ఆఫ్ కశ్మీర్

సోనీ లివ్‌లో ప్రసారమవుతున్న తాజా సీజన్ 'మాస్టర్ షెఫ్ ఆఫ్ ఇండియా' కోసం రుక్సార్ సయీద్ (33) 'షబ్ దేక్' అనే కశ్మీరీ వంట చేసింది. 'ఇది మా అమ్మమ్మ నుంచి మా అమ్మకు, మా అమ్మ నుంచి నాకు అందిన వంట. ముదురు గుమ్మడికాయ, నాటుకోడి, ఆల్ బకారా ఎండుగుజ్జు వేసి చేస్తాం. చాలా బాగుంటుంది' అంది. జడ్జీలుగా ఉన్న ప్రముఖ షెఫ్‌లు వికాస్ ఖన్నా, రణ్‌వీర్ బ్రార్, పూజా ధింగ్రా... కొద్దిగా రుచి చూసి 'అద్భుతం' అన్నారు. ఆమె ఇంకో ఎపిసోడ్‌లో 'షికారా రైడ్' అనే అల్పాహారం చేసింది. మటన్ కోఫ్తాను, పుదీనా మసాలాతో రంగరించి చేసింది. టేస్ట్ అదిరిందని వేరే చెప్పాలా?

'కశ్మీర్ లోయంతా రకరకాల మసాలా దినుసులు, మేం మాత్రమే తినే ఆకుకూరలు, కాయగూరలు ఉన్నాయి. వాటిని వండే పద్ధతి అందరికీ తెలియదు. మాస్టర్ షెఫ్ ద్వారా దేశమంతటికీ ఆ రుచులను తెలియజేయాలనుకుంటున్నాను' అంటుంది రుక్సార్ సయీద్.

ఆమె సంకల్పం గట్టిదిలాగుంది. తాజా సీజన్‌లో మహా మహా వంటగాళ్లు, వంటగత్తెలు పోటీ పడితే తుది జాబితాలో 22 మంది ఉంటే, వారిలో చాలామందిని అధిగ'మించి' టాప్ 12కు చేరింది రుక్సార్. దాంతో కశ్మీర్‌లో ఇప్పుడు ఈ షోను అక్కడి స్త్రీలు చూస్తున్నారు. రుక్సార్‌ను తమ ప్రతినిధిగా, తమ సామర్థ్యాలకు కొలమానంగా చూస్తున్నారు. 'ఆ సంతోషం చాలు నాకు. నన్ను స్ఫూర్తిగా తీసుకుని స్త్రీలు ముందుకు రావాలి' అంటుంది రుక్సార్.



ఫుడ్ టెక్నాలజీలో డాక్టరేట్

రుక్సార్ సయీద్‌ది పుల్వామా జిల్లాలోని పామ్‌పోర్ అనే ప్రాంతం. నిత్యం మంచు కురిసే ఈ ప్రాంతంలో కవులు ఎక్కువ. 'నేను కవిత్వం రాయను. కాని ప్లేట్‌లో పదార్థమే ఒక కవిత్వమంత అందంగా అమర్చగలను' అంటుంది రుక్సార్. ఫుడ్ టెక్నాలజీలో పీహెచ్‌డీ చేసిన రుక్సార్ అందరిలా ఏ లెక్చరర్ పోస్ట్‌కో వెళ్లలేదు. 'నాకు ఆహారం మీద సంపూర్ణ అవగాహన ఉంది. ముఖ్యంగా ఫ్రోజెన్ ఫుడ్‌ను సరిగా అమ్మగలిగితే తక్షణం వేడి చేసుకుని తినాలనుకునేవారికి మేలు జరుగుతుంది. కాని ఆహారంలో కల్తీ ఎక్కువ. ఈ కల్తీ విషంతో సమానం. అందుకే నేను ఏ కల్తీ లేని ఫ్రోజెన్ ఫుడ్‌ను అమ్మాలని ఖాలిస్ ఫుడ్స్ పేరుతో చిన్న సంస్థను మొదలుపెట్టాను. చికెన్ ఉత్పత్తులను కశ్మీర్‌లో అమ్ముతున్నాను. కశ్మీర్‌లో ఉద్యోగం చేయడం కన్నా ఉద్యోగాలు కల్పించడమే ఎక్కువ అవసరం అని నేను భావిస్తాను. నిరుద్యోగం పోవాలంటే ఇలాగే చేయాలి. నా సంస్థ బాగా నడుస్తోంది. కాని దేశవ్యాప్తంగా పంపాలంటే కొన్ని చిక్కులు ఉన్నాయి. ఈ లోపు నేను, నా బ్రాండ్ తెలియడానికి మాస్టర్ షెఫ్ ప్రోగ్రామ్‌కు వచ్చాను' అని తెలిపింది రుక్సార్.

అంతే తేడా

'వంట అందరు ఆడవాళ్లు చేస్తారు. కాని ఫుడ్ షోలలో ఆ వంటను శాస్త్రీయంగా చేయాలి. అంతే తేడా. కశ్మీర్‌లో వంట తెలిసిన యువతీ యువకులు బాగానే ఉన్నారు. నేను ఈ షో ద్వారా గడించిన అనుభవంతో వారికి సాయం చేయాలనుకుంటున్నాను. ఆహారం తయారు చేయడంలో మెళకువలు తెలిపి వారు ఫుడ్ జాయింట్‌లు ఏర్పాటు చేసుకుని తమ కాళ్ల మీద తాము నిలబడేలా చూడాలనుకుంటున్నాను. ఇందుకు కావాల్సిన సామగ్రి నేనే సమకూరుస్తాను' అంది. ఒక కొడుకు, ఒక కూతురు ఉన్న రుక్సార్ తన భర్త సాదిక్ అహ్మద్ సహకారం వల్లే ఇలా షోకు వచ్చినట్టుగా తెలిపింది. 'ఆడవాళ్లూ.. ప్రయత్నించండి. ఓడిపోవద్దు' అనేది రుక్సార్ సందేశం.

బ్యూటిప్స్

కనుబొమలకు కలోంజీ





నల్లజీలకర్ర (కలోంజీ) విత్తనాలను పొడిచేయాలి. ఈ పొడిలో ఆలివ్ ఆయిల్, అలోవెరా జెల్‌ను వేసి చక్కగా కలపాలి. ఇప్పుడు తడి కాటన్ వస్త్రంతో కనుబొమలను శుభ్రంగా తుడిచి.. నల్ల జీలకర్ర మిశ్రమాన్ని ప్యాక్‌లా వేయాలి. ఇరవై నిమిషాలు ఆరాక కడిగేయాలి. కనుబొమ్మలను తడిలేకుండా తుడిచి కొద్దిగా ఆలివ్ ఆయిల్‌ను కనుబొమలపైన రాసి ఐదునిమిషాలపాటు మర్దన చేయాలి.

- ఈ ప్యాక్‌ను వారానికి మూడుసార్లు వేయడం వల్ల రక్తప్రసరణ చక్కగా జరిగి కనుబొమల మీద వెంట్రుకలు పెరుగుతాయి.
- నల్లజీలకర్ర ప్యాక్ పలుచటి కనుబొమలను ఒత్తుగా మారుస్తుంది. కనుబొమలు తీరైన ఆకృతిలో చక్కగా మెరుస్తాయి.
- కలోంజీలోని పోషకాలు కనుబొమల వెంట్రుకలు రాలకుండా చేస్తాయి.
- కనుబొమలు తెల్లబడడం మొదలైన వారు సైతం ఈ ప్యాక్‌ను వాడితే వెంట్రుకలు నల్లగా మారతాయి.

ప్రమాదమా..? టాన్యా ఉందిగా..!



కాస్త ఖాళీ సమయం దొరికినప్పుడు... సెలవుల్లో స్నేహితులతో కలిసి ట్రెక్కింగ్‌కు వెళ్తుంటారు చాలామంది యువతీ యువకులు. అయితే అనుకోకుండా ఏదైనా ప్రమాదంలో చిక్కుకుంటే వారిని ఎవరు కాపాడతారు? అందుకే అలాంటి వారికి అండగా ఉంటోంది టాన్యా. అవును, సరదాగా గడపాల్సిన వయసులో ఇతరుల ప్రాణాలను రక్షిస్తోంది టాన్యా కోలి. ఐదోఏటి నుంచే కొండలు ఎక్కడం నేర్చుకుని, టీనేజ్‌లోకి వచ్చినప్పటి నుంచి ఏకంగా రెస్క్యూ టీమ్‌ను నిర్వహిస్తూ ఎంతోమందిని ఆపదల నుంచి బయటపడేసింది. పెద్ద పెద్ద కొండలను అవలీలగా ఎక్కేస్తూ, మరొకరికి సాయంగా నిలబడుతూ.. నేటి యువతరానికి స్ఫూర్తిగా నిలుస్తోంది టాన్యా.

నాసిక్‌కు చెందిన టాన్యా కోలి ఐదేళ్ల వయసు నుంచే పర్వతాలు ఎక్కడం నేర్చుకోవడం మొదలు పెట్టింది. టాన్యా తండ్రి దయానంద్ కోలి నాసిక్ క్లైంబర్స్ అండ్ రెస్క్యూయర్స్ అసోసియేషన్‌లో పని చేస్తుండడంతో తరచూ ట్రెక్కింగ్, రెస్క్యూ అనే పదాలను తండ్రి నోట వెంట వినేది. టాన్యాకూ ట్రెక్కింగ్ పైన ఆసక్తి ఏర్పడడంతో తండ్రి దగ్గర ట్రెక్కింగ్ ఎలా చేయాలో నేర్చుకుంది. అలా ట్రెక్కర్‌గా మారిన టాన్యా, రెస్క్యూటీమ్ కలిసి ఎంతోమందిని ప్రమాదాల నుంచి బయటపడేస్తోంది. తండ్రి దగ్గర నేర్చుకున్న ట్రెక్కింగ్ మెళకువలతోపాటు, హిమాలయాల్లో ప్రత్యేకమైన శిక్షణ కూడా తీసుకుంది. ప్రమాదంలో ఉన్న వారిని కాపాడడంతోపాటు, పర్వతారోహకులకు ట్రెక్కింగ్‌లో శిక్షణ ఇస్తోంది టాన్యా. పర్వతాన్ని అధిరోహించేటప్పుడు జరిగే ప్రమాదాలను ఎలా ఎదుర్కోవాలో కూడా నేర్పిస్తుంది. టాన్యా దగ్గర శిక్షణ తీసుకుంటున్నవారిలో మహారాష్ట్ర పోలీసు అకాడమీ ట్రైనీలు కూడా ఉన్నారు. ప్రతిసారీ తను అందుబాటులో ఉండడం కష్టం కాబట్టి ఇతరులకు నేర్పించడం ద్వారా ప్రమాద సమయంలో వారిని వారే కాపాడుకోవడంతోపాటు, ఇతరులను కూడా కాపాడగలరు. అందుకే మరింతమందికి రెస్క్యూలో శిక్షణ ఇస్తున్నాను అని టాన్యా చెబుతోంది.

''ప్రమాదంలో ఉన్నారు, కాపాడాలి అని సమాచారం తెలిస్తే వెంటనే బయలుదేరతాం. అది అర్ధరాత్రి అయినా ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో సిద్ధంగా ఉంటాం. ట్రెకింగ్ చేసేవారిని, ప్రమాదంలో ఉన్న వ్యక్తుల్ని రక్షించడం థ్రిల్లింగ్ ఇచ్చేదే అయినప్పటికీ చాలా సవాళ్లతో కూడుకున్నది. సమస్యలు ఉన్నప్పటికీ అవతలి వారిని ప్రమాదం నుంచి కాపాడగలిగామన్న సంతృప్తి ముందు ఆ సమస్యలు, సవాళ్లు చిన్నబోవలసిందే'' అని చెబుతోంది టాన్యా.


ఇప్సితా దాస్‌గుప్తా

సందర్భం

ఆమె సక్సెస్ మంత్రా...

వ్యూహ చతురత వృత్తి నిబద్ధత

అనుభవం నేర్పిన పాఠాలు అద్భుత విజయాలను సొంతం చేస్తాయి.
రెండు దశాబ్దాలకు పైగా ఎన్నో కార్పొరేట్ కంపెనీలలో పని చేసిన ఇప్సితా దాస్‌గుప్తా ఎన్నో విలువైన పాఠాలను నేర్చుకుంది.
అమెరికాలో యాపిల్ సర్వీసెస్‌లో సీనియర్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్‌గా విధులు నిర్వహించి మంచి పేరు తెచ్చుకుంది.
తాజాగా...
అమెరికన్ మల్టీ నేషనల్ ఐటీ కార్పొరేషన్ 'హెచ్‌పీ ఇండియా' సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (ఎస్‌వీపీ), మేనేజింగ్ డైరెక్టర్‌గా నియామకం అయింది...

పనిలోని కష్టమే ఇష్టమైతే అంతకంటే సుఖం ఏమున్నది?

కొలంబియా యూనివర్శిటీలో మ్యాథ్స్, ఎకనామిక్స్‌లో డిగ్రీ, హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో ఎంబీఏ చేసిన ఇప్సితా ఎన్నో మల్టీ నేషనల్ కంపెనీలలో పనిచేసింది. ముంబై రోడ్లపై ఉరుకులు, పరుగులు, పని భారంతో నిద్రలేని రాత్రులు ఆమెకు కొత్తేమీ కాదు.

కుటుంబ జీవితాన్ని, వృత్తి జీవితాన్ని సమన్వయం చేసుకోడంలో సమస్యలు తలెత్తాయి.

'నాకు కష్టంగా ఉంది' అని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు.

ఎన్నో కంపెనీలలో మార్కెటింగ్, స్ట్రాటజీ విభాగాలకు నేతృత్వం వహించి మన దేశంతో సహా బంగ్లాదేశ్, శ్రీలంకలలో పనిచేసింది ఇప్సితా. ఆఫీస్ గదికే పరిమితం కాకుండా జనాల్లోకి వెళ్లి క్లయింట్స్ అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండేది. వాటికి అనుగుణంగా వ్యూహాలను రూపొందించుకునేది.

యాపిల్‌కు ముందు స్టార్ ఇండియా ప్రెసిడెంట్ ఆఫ్ కార్పొరేట్ స్ట్రాటజీ, జనరల్ ఎలక్ట్రిక్ కంపెనీ దక్షిణ ఆసియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్‌గా పని చేసిన ఇప్సితా వృత్తికి సంబంధించి నిర్ణయాలు తీసుకునే ముందు ఒకటికి పదిసార్లు ఆలోచిస్తుంది. చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందరితో చర్చిస్తుంది.

'తీసుకున్న నిర్ణయాలను వెనక్కి తీసుకోవచ్చునేమోగానీ, ఆ నిర్ణయం ఫలితంగా ఉత్పన్నమయ్యే పరిస్థితులను వెనక్కి తీసుకోలేదు. అందుకే ఒక నిర్ణయం తీసుకునే ముందు వంద కోణాల్లో ఆలోచిస్తాను' అంటుంది ఇప్సితా.

'మీకు ఇన్‌స్పిరేషన్ ఎవరు?' అనే ప్రశ్నకు ఇప్సితా చెప్పే జవాబు...
'వీరు వారు అని కాదు. నేను మాట్లాడే ప్రతి వ్యక్తి నుంచి ఎంతో కొంత ఇన్‌స్పైర్ అవుతుంటాను. సాధారణ ప్రజల నుంచి ఇన్వెస్టర్‌లు, లీడర్‌లు, ఆర్టిస్టుల వరకు నాకు ఎంతోమంది రోల్ మోడల్స్ కనిపిస్తారు'

ఉద్యోగంలోకి అప్పుడే వచ్చిన రోజుల్లో ఇప్సితాలాంటి కొత్త ఉద్యోగులకు సీనియర్‌ల నుంచి వినిపించిన మాట 'ఇలా ఎవరైనా ఆలోచిస్తారా?'

అందరిలాగే ఇప్సితా ఆలోచించి నట్లయితే ఆమెకు ఇంత పేరు వచ్చేది కాదేమో.

'ఇలా కూడా చేయవచ్చు... అంటూ సంప్రదాయ విధానాలకు భిన్నంగా ఆలోచించేదాన్ని. ఇది సీనియర్‌లకు రుచించేది కాదు. అయితే నా ఆలోచనల్లో సత్తా ఉందని ఆ తరువాత నిరూపణ అయింది' అంటుంది ఇప్సితా.

వృత్తిరీత్యా ఇప్సితా దాస్‌గుప్తా ఒక సమస్యకు పరిష్కారం వెదకగానే పని అక్కడితో ఆగిపోదు. 'మేమున్నాం' అంటూ కొత్త సమస్యలు పుట్టుకొస్తుంటాయి. గత సమస్యలతో వీటికి పోలిక ఉండకపోవచ్చు. కొన్నిసార్లు పరిష్కారం దుర్భేద్యంగా అనిపించవచ్చు. ఇలాంటి సమయంలోనే వ్యూహకర్తలు చురుగ్గా ఆలోచించాలి.

వ్యూహకర్తగా ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపిన ఇప్సితా దాస్‌గుప్తా ఎంతోమందికి రోల్ మోడల్‌గా నిలిచింది.


డాక్టర్ మురళీకృష్ణ

నేను జయించాను

వైద్యులు రోగులకు వైద్యం చేస్తారు. పేషెంట్ వ్యాధిని అంచనా వేసి, పరీక్షలతో నిర్ధారణకు వచ్చి, సిలబస్‌లో చదివిన సమాధానాలతో వైద్యం చేస్తారు. మరి... అప్పటివరకు లేని కొత్త రోగం వస్తే? చికిత్స కోసం అప్పటికే చదివిన సిలబస్‌లో సమాధానం ఎలా వెతకాలి? వైద్యవిద్యలో చెప్పని పాఠాల కోసం అన్వేషణ ఎలా మొదలు పెట్టాలి? అందుకే... 'పేషెంట్‌లు, పరిశోధనలే నా గురువులు' అన్నారు డాక్టర్ మురళీకృష్ణ. ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... నిర్ధారిత ప్రయోగాలు, నిరూపిత సమీకరణలతో వైద్యం చేయడానికే పరిమితం కాకూడదు. రోగికి అవసరమైన కొత్త సమీకరణాలను వైద్యులు సృష్టించగలగాలన్నారు. బ్రాండ్స్ ఇంపాక్ట్ సంస్థ విశేషంగా వైద్యసేవలందించిన వైద్యులను ఇటీవల న్యూఢిల్లీలో గౌరవించింది. పేదవారికి తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తూ 'హెల్త్ కేర్ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ 2023' పురస్కారం అందుకున్నారు తెలుగు డాక్టర్ మురళీకృష్ణ.

మైక్రో బయాలజీ నడిపించింది!

''మాది అంబేద్కర్ కోనసీమ జిల్లా, రామచంద్రాపురం. కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజ్‌లో ఎంబీబీఎస్, అదే కాలేజ్‌లో ఎం.డీ (మైక్రో బయాలజీ) కూడా చేసి, సాంక్రమిక వ్యాధుల నిపుణుడిగా ప్రాక్టీస్ చేస్తున్నాను. మైక్రో బయాలజీలో చేరడం ఇష్టంతో కాదని చెప్పడానికి ఏ మాత్రం మొహమాట పడను. సీటు వచ్చిన కోర్సుతో రాజీపడిపోయాను. కానీ కోర్సు మొదలైన తర్వాత ఏర్పడిన ఆసక్తిని మాటల్లో వర్ణించలేను. నేరుగా వైద్యం చేయడం కంటే వైద్యరంగానికి అవసరమైన తెర వెనుక కృషి చాలా సంతృప్తినిచ్చింది. గర్భిణులు, ఇతర వ్యాధిగ్రస్థులకు పరీక్షల కోసం సేకరించిన రక్త నమూనాలను తీసుకుని ఎయిడ్స్ వైరస్ గురించి ప్రభుత్వం చాలా గోప్యంగా పరీక్షలు నిర్వహించేది. మనదేశంలో వెయ్యిలో 15 మందిలో ఎయిడ్స్ వైరస్ ఉన్నట్లు, అది దక్షిణాది ఆఫ్రికా దేశాల నుంచి మనదేశంలోకి వస్తున్నట్లు తెలుసుకున్నాం. దేశంలో ప్రభుత్వ సంస్థల దగ్గర ఉన్న సమాచారమంతటినీ సేకరించాను. అన్ని సంస్థల దగ్గరున్న సమాచారం కంటే ఎక్కువ డాటా నా దగ్గరుంది. అప్పట్లో మనదగ్గర ఎయిడ్స్‌కి వైద్యం చేసే డాక్టర్‌లు లేరు. అనుబంధ సమస్యలకు వైద్యం చేసే నిపుణులే హెచ్ఐవీకి కూడా మందులిచ్చేవారు. ఆ ఖాళీని భర్తీ చేయాలనుకున్నాను. రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలి హెచ్ఐవీ ఫిజీషియన్‌ని నేనే.

వారానికి ఇద్దరు పేషెంట్‌లు!

సొంత ప్రాక్టీస్ మొదలుపెట్టింది 2000లో. మొదట్లో వారానికి ఇద్దరు లేదా ముగ్గురు పేషెంట్‌లు వచ్చేవారు. దాంతో నా సమయాన్ని ఎయిడ్స్ అధ్యయనానికి ఉపయోగించాను. ప్రముఖ పరిశోధకులందరూ శాస్త్రం ఆధారంగా ఎయిడ్స్‌కు వైద్య శోధన మొదలు పెట్టారు. నా అధ్యయనం, పరిశోధనలను పేషెంట్ వైపు నుంచి మొదలు పెట్టాను. ఎయిడ్స్‌కి మాంటూక్స్ టెస్ట్ అలాంటిదే. ఎయిడ్స్ వ్యాధిగ్రస్థులు వ్యాధినిరోధక శక్తిని కోల్పోయి టీబీ సోకడం సర్వసాధారణంగా జరిగేది. ఎయిడ్స్ మరణాల్లో ఎక్కువ టీబీ మరణాలే ఉండేవి. '13వ ఇంటర్నేషనల్ ఎయిడ్స్ కాన్ఫరెన్స్' సౌత్ ఆఫ్రికాలోని దర్బన్‌లో జరిగింది. ఆ సదస్సులో నేను 'మాంటూక్స్ టెస్ట్' ఎయిడ్స్ తీవ్రత పట్ల ఒక అంచనాకు రావచ్చని చెప్తూ నా పరిశోధన పత్రాన్ని సమర్పించాను. అది ఎయిడ్స్ చికిత్సలో కొత్త దృక్పథానికి దారి తీసింది. ఎయిడ్స్ చికిత్సలో వైద్యం మొదలు పెట్టిన వారం రోజుల నుంచి రికవరీ స్పష్టంగా తెలుస్తుంది. అయితే జీవితకాలం మందులు వాడాల్సిందే. పేషెంట్ తిరిగి తన పనులకు వెళ్లగలిగేటట్లు చేయడం నా వైద్యం ఉద్దేశం. ఈ వ్యాధి పేదవాళ్లలోనే ఎక్కువ. వారికి వైద్యం చేయడంలో టెస్టుల మీద ఆధారపడకుండా వ్యాధి లక్షణాలు, చిహ్నాలను బట్టి తీవ్రతను అంచనా వేసి చికిత్స చేస్తాను. అలాగే రెండంచెల ఔషధాలతో వైద్యం చేయడం కూడా నేను చేసిన మరో ప్రయోగం. ఫ్రాన్స్‌లో జరిగిన 'ఇంటర్నేషనల్ సింపోజియమ్ హెచ్ఐవీ ఎమర్జింగ్ మెడిసిన్' సదస్సులో పేపర్ సమర్పించాను. నేను ప్రతిపాదించిన పదేళ్ల తర్వాత 2019 నుంచి ఇప్పుడు అంతర్జాతీయంగా టూ డ్రగ్స్ చికిత్సనే అనుసరిస్తున్నారు.



'హెల్త్ కేర్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ 2023' అందుకుంటున్న డాక్టర్ మురళీకృష్ణ

కోవిడ్‌కి ఇంట్లోనే వైద్యం

కోవిడ్ వైద్యరంగానికి పెద్ద సవాల్ అనే చెప్పాలి. ఒక వ్యాధికి మందులు రావాలంటే దశాబ్దాల పరిశోధన తర్వాత మాత్రమే సాధ్యం. కొత్త వ్యాధి, పైగా ఒక్కసారిగా విజృంభించినప్పుడు రోగులందరికీ ఒకేసారి నాణ్యమైన వైద్యం అందించడం ఎవరికీ సాధ్యం కాదు. వ్యాధి విస్తరించినంత వేగంగా ప్రత్యామ్నాయాల అన్వేషణ కూడా జరగాలన్న ఆలోచనతో సులభంగా, చవగ్గా దొరికే మందులతో హోమ్‌కేర్ కిట్ రూపొందించాను. కోవిడ్ మీద అవగాహన కోసం వీడియోలు చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాను. ఒక్కో పోస్ట్ వేలసార్లు షేర్ అయింది. వైద్యం కోసం పేషెంట్‌లు అప్పుల పాలు కాకూడదనేది నా పాలసీ. అందుకోసమే నా తాపత్రయమంతా. కోవిడ్ మీద కూడా అవగాహన పుస్తకం తెచ్చాను. కోవిడ్ తర్వాత వస్తున్న సమస్యల మీద అధ్యయనం ఇంకా కొనసాగుతోంది. నాలుగు ఇంటర్నేషనల్ సెమినార్‌లలో పేపర్‌లు ప్రెజెంట్ చేశాను. ఇంకా చేస్తాను కూడా. ఒక డాక్టర్‌గా వైద్యరంగం నేర్పించిన జ్ఞానంతో పేషెంట్‌లను ఆరోగ్యవంతులను చేయడానికి కృషి చేయడం అనేది నూటికి తొంబై తొమ్మిది మంది చేసే పని. నా కృషితో వైద్యరంగానికి తోడ్పాటు అందించడం నా విజయం. మొదట ఆరోగ్యపరంగా నన్ను నేను జయించాను. ఆ తర్వాత జీవితాన్ని జయించాను. మా ఇంట్లో తొలి వైద్యుడిని నేనే. నా పిల్లలిద్దరిలో ఎవరూ వైద్యరంగం పట్ల ఆసక్తి చూపకపోవడమే మనసుకు బాధ కలిగించే విషయం'' అన్నారు ప్రజారోగ్య పరిరక్షణలో జీవన సాఫల్య పురస్కారం అందుకున్న డాక్టర్ మురళీకృష్ణ.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఎయిడ్స్ అవగాహన వ్యాసాలు

హెచ్ఐవీ గురించి మన సమాజంలో విపరీతమైన భయం రాజ్యమేలుతున్న రోజులవి. ఆ వ్యాధి పట్ల అవగాహన కల్పించడం కోసం నగరాలు, పట్టణాలు, చిన్న కాలనీలు, గ్రామాల్లో ఐదు వందలకు పైగా సమావేశాల్లో ప్రసంగించాను. వయోజనుల్లో అవగాహన కోసం 'అక్షర గోదావరి' పేరుతో క్లుప్తంగా, సరళంగా సామాన్యులకు అర్థమయ్యే రీతిలో రాశాను. మొదట మా జిల్లాలో ప్రయోగాత్మకంగా మొదలు పెట్టిన ఆ ప్రాజెక్టును తర్వాత అన్ని జిల్లాలకూ విస్తరించారు. ఆశ వర్కర్స్, రీసోర్స్ పర్సన్స్‌కి ప్రామాణిక గ్రంథంగా నా రచననే తీసుకున్నారు. హెచ్ఐవీ గురించిన అవగాహన వ్యాసాలతో 'ఎయిడ్స్' పేరుతో పుస్తకాన్ని ప్రచురించాను. ఆ పుస్తకం పునర్ముద్రణలతో పదేళ్లలో ఎనిమిది వేల కాపీలు అమ్ముడవుతుందని నేను కూడా ఊహించలేదు. ఎంజీజీఎస్‌లో కాలేజ్ మ్యాగజైన్‌కి ఎడిటర్‌గా పని చేసిన అనుభవమే ఇప్పటికీ నా అధ్యయనాలన్నింటినీ అక్షరబద్ధం చేయిస్తోంది.

- డాక్టర్ యనమదల మురళీకృష్ణ, ఎం.డి.,
కాకినాడ, ఆంధ్రప్రదేశ్

ఇండస్ట్రీ 4 స్టార్టప్స్‌కు ‘కల్పతరువు’ విశాఖ



- దేశంలో తొలి ఇండస్ట్రీ 4 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ కల్పతరువు
- తొలి దశలో 5 స్టార్టప్స్ ఏర్పాటు
- రెండో దశలో మరో 16 ఏర్పాటుకు రంగం సిద్ధం
- 13 సంస్థలు స్టీల్‌ప్లాంట్ సమస్యలపై పరిశోధనలు
- సాధారణ సమస్యలపై వినూత్న ఆవిష్కరణలకు సిద్ధంగా 8 స్టార్టప్‌లు
- ఆవిష్కరణలను మరిన్ని ప్రభుత్వరంగ సంస్థలకు విస్తరణ
- తాజాగా హిందుస్థాన్ షిప్‌యార్డ్‌తో ఒప్పందం
- ఎన్‌టీపీసీ, ఐవోసీఎల్ వంటి సంస్థలతో చర్చలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్టార్టప్‌లు యూనికార్న్ కంపెనీలు (కంపెనీ విలువ బిలియన్ డాలర్లకు చేరడం)గా ఎదగాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంకల్పానికి విశాఖ కేంద్రంగా మారుతోంది. పారిశ్రామిక రంగంలో నాలుగో తరం సాంకేతిక విప్లవంగా పేర్కొంటున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐవోటీ), రోబోటిక్, ఆటోమేషన్, బిగ్ డేటా వంటి టెక్నాలజీల్లో నూతన ఆవిష్కరణలకు కేంద్ర స్థానమవుతోంది. విశాఖపట్నంలో ఏర్పాటైన దేశంలోనే మొట్టమొదటి ఇండస్ట్రీ 4 సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ ‘కల్పతరువు’లో ఈ నూతన ఆవిష్కరణలపై పలు స్టార్టప్స్ సంస్థలు జోరుగా పరిశోధనలు సాగిస్తున్నాయి.

ఇండస్ట్రీ 4 ఆవిష్కరణలను ప్రోత్సహించేలా కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ, సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ), ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ సొసైటీ, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) సంయుక్తంగా విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రాంగణంలో కల్పతరువు పేరిట సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ని రూ. 20 కోట్లతో ఏర్పాటు చేశాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌లో వేడి ఉక్కు ద్రావణం ప్రవహించే చోట్ల, అధిక వేడి ఉండే కొలిమిల వద్ద మనుషులు పనిచేయడం చాలా కష్టం. ప్రమాదాలు జరిగే అవకాశాలూ ఎక్కువ. ఇలాంటి చోట మానవరహితంగా పూర్తి ఆటోమేటిక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసేలా కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించడమే కల్పతరువు ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా ఆర్ఐఎన్ఎల్ ఉక్కు తయారీలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటికి నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా పరిష్కారాన్ని చూపేలా పరిశోధనలు చేయడానికి ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్స్‌ను ప్రకటిస్తూ ఉంటుంది. ఇలా ఆర్ఐఎన్ఎల్ ఇచ్చిన సమస్యలపై పరిశోధన చేసి నూతన ఆవిష్కరణలను కనుక్కోవడానికి అనేక స్టార్టప్ సంస్థలు విశాఖ కల్పతరువును వేదికగా చేసుకొంటున్నాయి. తొలి దశలో అయిదు స్టార్టప్స్ పరిశోధనలు ప్రారంభించాయి. తాజాగా రెండో దశలో మరో 16 స్టార్టప్స్ ఆవిష్కరణలను ఎంపిక చేసినట్లు సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీపీఐ) వైజాగ్ అడిషనల్ డైరెక్టర్ సురేష్ ‘సాక్షి’కి తెలిపారు. రెండు దశలతో కలిపి 21 స్టార్టప్‌లు ఇక్కడ ఏర్పాటవుతున్నాయి. గతంలో ఏర్పాటైన 5 స్టార్టప్‌లు, తాజా స్టార్టప్‌లలో 8 కంపెనీలు స్టీల్‌ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్) సమస్యలపై పరిశోధనలకు ఏర్పాటయ్యాయి. మిగతా 8 స్టార్టప్‌లు సాధారణ సమస్యలపై పరిశోధన చేస్తాయి. ఈ 8 సంస్థలు అందరికీ ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చేలా వినూత్నమైన ఆలోచనలతో వచ్చాయని, అందుకే వాటిని ఎంపిక చేశామని సురేష్ చెప్పారు. తాజాగా వచ్చిన 16 స్టార్టప్స్ పరిశోధనల కోసం కల్పతరువులో ఇంక్యుబేషన్ సెంటర్‌తో పాటు ల్యాబ్, ఆర్థిక సహకారం వంటి ప్రయోజనాలను కల్పిస్తారు.

మరిన్ని ప్రభుత్వ రంగ సంస్థలకు విస్తరణ

ప్రస్తుతం స్టీల్‌ప్లాంట్ సమస్యల పరిష్కారానికే పరిమితమైన కల్పతరువును మరిన్ని ప్రభుత్వరంగ సంస్థలకు విస్తరించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. తాజాగా మరో కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ హిందుస్థాన్ షిప్‌యార్డ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని సురేష్ చెప్పారు. త్వరలోనే షిప్‌యార్డ్ సమస్యలను నాలుగో తరం సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కరించేలా ప్రాబ్లమ్ స్టేట్‌మెంట్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపారు. విశాఖ కేంద్రంగా పనిచేస్తున్న ఎన్‌టీపీసీ, విశాఖ పోర్టు, హెచ్‌పీసీఎల్ వంటి మరికొన్ని ప్రభుత్వరంగ సంస్థలతో కూడా చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు.

మిరప.. రెపరెప

రికార్డు స్థాయిలో సాగు

- ఖరీఫ్‌లో సాధారణ విస్తీర్ణం 4.84 లక్షల ఎకరాలు
- 2022–23లో రికార్డు స్థాయిలో 5.70 లక్షల ఎకరాల్లో సాగు
- ఈ ఏడాది కనీసం 6.30 లక్షల ఎకరాలు దాటుతుందని అంచనా
- ఫలించిన సస్యరక్షణ చర్యలు.. నల్ల తామర సహా చీడపీడలు దూరం
- గతేడాది కంటే మిన్నగా దిగుబడులు వస్తాయని అంచనా



సాక్షి, అమరావతి

ఈ రైతు పేరు కంబాల బ్రహ్మం. పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన ఈయన గతేడాది 2 ఎకరాల్లో మిరప సాగు చేశారు. ఈ ఏడాది బోరు కింద 4 ఎకరాల్లో మిరపను సాగు చేస్తున్నారు. ప్రభుత్వం, ఉద్యాన శాఖ అధికారుల అండదండలతో సాగు చేస్తున్నామని.. నల్ల తామర సహా చీడపీడలు, తెగుళ్ల ప్రభావం ఎక్కడా కనిపించలేదని బ్రహ్మం చెబుతున్నారు. ఈ ఏడాది దిగుబడితోపాటు గతేడాది కంటే మంచి ఆదాయం వస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

ఈ ఏడాది మిరప పంటను రైతులు రికార్డు స్థాయిలో సాగు చేస్తున్నారు. మంచి ధర పలుకుతుండటంతో ప్రతికూల వాతావరణంలోనూ భారీ విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. నల్ల తామర సహా చీడపీడలు, తెగుళ్ల ప్రభావం పెద్దగా లేకపోవడం.. గత ఏడాది కంటే మిన్నగా దిగుబడులొచ్చే అవకాశం ఉండటంతో రైతుల్లో ఉత్సాహం కనిపిస్తోంది. రాష్ట్రంలో మిరప సాధారణ విస్తీర్ణం 4.87 లక్షల ఎకరాలు కాగా.. గతేడాది రికార్డు స్థాయిలో 5.70 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది ఇప్పటికే 6 లక్షల ఎకరాల్లో మిరప నాట్లు వేయగా.. నవంబర్ మొదటి వారం వరకు పంట వేసే అవకాశం ఉన్నందున అదనంగా కనీసం మరో 20–30 వేల ఎకరాల్లో సాగయ్యే అవకాశాలు ఉన్నాయని అంచనా వేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో వర్షాభావ పరిస్థితులు ఒకింత కలవరపెట్టినప్పటికీ సెప్టెంబర్‌లో కురిసిన వర్షాలు రైతులకు ఊరటనిచ్చాయి. గతేడాది కురిసిన వర్షాలతో భూగర్భ జలాలకు లోటు లేకపోవడంతో బోర్ల కింద రికార్డు స్థాయిలో పంటలు వేశారు.

సమృద్ధిగా ఎరువులు.. ఫలిస్తున్న సస్యరక్షణ చర్యలు

సీజన్ ఆరంభం నుంచి ప్రభుత్వం అండగా నిలవడంతో ఏ దశలోనూ విత్తనం, ఎరువుల కోసం రైతులు ఇబ్బందిపడలేదు. ఆర్బీకేల్లో సమృద్ధిగా ఎరువులు అందుబాటులో ఉంచడంతో గ్రామంలోనే పొందగలుగుతున్నారు. మరోవైపు నల్ల తామరను ఎదుర్కొనేందుకు ఆర్బీకే స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించడంతో రైతులు జాగ్రత్త పడ్డారు. ప్రస్తుతం పంట 85 శాతం ఏపుగా పెరిగే దశలో ఉండగా.. 15 శాతం పూత దశకు చేరుకుంది. ప్రభుత్వ చర్యల ఫలితంగా నల్లతామరతో సహా ఇతర చీడపీడలు, తెగుళ్ల జాడ కనిపించలేదు.



దిగుబడి.. ధరలపై ఆశలు

గతేడాది ఎకరాకు 18 నుంచి 23 క్వింటాళ్ల దిగుబడి రాగా.. ఈసారి 20–25 క్వింటాళ్లకు తగ్గదని అధికారులు చెబుతున్నారు. గతేడాది 11.50 లక్షల టన్నుల దిగుబడులు రాగా.. ఈ ఏడాది 12 లక్షల టన్నులకు పైగా వస్తుందని అంచనా వేస్తున్నారు. 2022–23లో గరిష్టంగా క్వింటాల్ ధర రూ.27 వేలు పలకగా.. ప్రస్తుతం కనిష్టం రూ.20వేలు, గరిష్టంగా రూ.29 వేలు, మోడల్ రకం రూ.24 వేల వరకు పలుకుతోంది. తొలుత మార్కెట్‌కు వచ్చే మధ్యప్రదేశ్ మిరపపై వర్షాభావ పరిస్థితులు ప్రభావం చూపడంతో మిరప ధర మరింత పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. పంట కోతకొచ్చే సమయానికి రూ.30 వేల నుంచి రూ.32 వేలకు పైగా చేరవచ్చని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మిరపకు ఢోకా లేదు

మిరప గతేడాది కంటే మిన్నగా సాగవుతోంది. ఇప్పటికే 6 లక్షల ఎకరాలు దాటింది. సీజన్ ముగిసే నాటికి కనీసం 6.30 లక్షల ఎకరాలు దాటే అవకాశాలు ఉన్నాయి. ఆర్బీకే స్థాయిలో చేపట్టిన సస్యరక్షణ చర్యల వల్ల నల్లతామర, చీడపీడల ప్రభావం కనిపించలేదు. ప్రస్తుతం రికార్డు స్థాయిలో పెరుగుతున్న ధరలు వల్ల రైతులకు మంచి ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి.

– ఎం.వెంకటేశ్వర్లు, అడిషనల్ డైరెక్టర్, ఉద్యాన శాఖ

అలంకార అరటి.. ఆంధ్రా మేటి!

అర్నమెంటల్ బనానా సాగుకు అనువుగా గోదావరి జోన్

- ఉద్యాన వర్సిటీలో ఫలించిన పరిశోధనలు
- పుష్పగుచ్ఛాలు, గోడలపై అలంకరణల్లో వినియోగం
- వీటి ఆకులతో బయో ప్లేట్స్ తయారీ
- ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం

సాక్షి, అమరావతి: విదేశాల్లో విశేష ప్రాచుర్యం పొందిన అలంకార అరటి (ఆర్నమెంటల్ బనానా) సాగుకు ఆంధ్రప్రదేశ్ అనువైనదిగా గుర్తించారు. ఈ రకం అరటిని సాగు చేసేందుకు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధకులు చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలిస్తున్నాయి. ప్రపంచ ఉద్యాన పరిశ్రమలో అలంకార అరటి రకాలు ఇటీవల కాలంలో విశేష ప్రాచుర్యం పొందుతున్నాయి. అలంకార అరటి రకాలు ఆహ్లాదం గొలిపేలా ఉంటాయి. అందమైన ఆకులు, పువ్వుల కోసం వీటిని పెంచుకుంటారు. అయితే.. ఇవి తినదగిన పండ్లను ఉత్పత్తి చేయలేవు.

6 నెలలకు రూ.లక్ష ఆదాయం

బ్రెజిల్, థాయ్‌లాండ్, మయన్మార్, చైనా దేశాలలో ఈ రకాలు విశేష ప్రాచుర్యంలో ఉన్నాయి. వీటికి ఆ దేశాల్లో మంచి డిమాండ్ కూడా ఉంది. నాలుగు మూసా జాతులను సంకరపర్చడం ద్వారా వీటిని అభివృద్ధి చేశారు. ఇవి చాలా పొట్టిగా, చిన్నగా.. చూసేందుకు అందంగా కనిపిస్తాయి. ఇంటి పెరట్లోనూ, కుండీలలోను ఈ రకాలను పెంచుకోవచ్చు. ఈ మొక్కలను కనీసం ఒకటిన్నర మీటర్ దూరంలో నాటుకోవచ్చు. నేల స్వభావాన్ని, తోటలోని అనువును బట్టి ఇంకా దగ్గరగా కూడా నాటుకోవచ్చు. వీటికి సోకే ఆకుమచ్చ, గొంగళి పురుగుల నివారణ కోసం కనీస సంరక్షణ చర్యలు చేపడితే చాలు. కుండీ మొక్కలు, ఇంటి ముంగిట, పెరటి తోటల్లో అందం కోసం నాటుకోవడానికి పిలకల్ని ఉత్పత్తి చేయడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు. ప్రతి 6 నెలలకు ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం పొందే అవకాశం ఉంది. వీటి ఆకులను పుష్పగుచ్ఛాల్లో విరివిగా ఉపయోగిస్తుంటారు. గోడలపై అలంకరణలకు, బయో ప్లేట్స్‌గా కూడా ఉపయోగిస్తున్నారు. విదేశాల్లో మాత్రమే సాగవుతున్న ఈ రకాల సాగుకు రాష్ట్రంలోని గోదావరి జోన్‌లోని ఉష్ణ మండల ప్రాంతం అనువైనదిగా గుర్తించారు. ఆ దిశగా రైతులను ప్రోత్సహించే దిశగా ఉద్యాన విశ్వవిద్యాలయం కృషి చేస్తోంది.



సత్ఫలితాలిచ్చాయి



గోదావరి మండలంలో ప్రధాన పండ్ల అరటిలో ఆర్నమెంటల్ అరటి జాతుల సాగుపై చేసిన పరిశోధనలు సత్ఫలితాలిచ్చాయి. తేమతో కూడిన పరిస్థితులలో వీటి సాగుపై అధ్యయనం చేశాం. మన ప్రాంత వాతావరణానికి అనువుగా, వీటి సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఈ పరిశోధన ఎంతగానో దోహదపడుతుందని గుర్తించాం.

– డి.బేబి శ్రీదివ్య, ఎమ్మెస్సీ విద్యార్థిని, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ

సత్ఫలితాలిస్తున్న పరిశోధనలు



పీహెచ్‌డీ విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు సత్ఫలితాలిస్తున్నాయి. మన ప్రాంతం వీటి సాగుకు అనువైనదిగా గుర్తించాం. రైతులకు పరిశోధనా ఫలాలు అందించేందుకు పీహెచ్‌డీ విద్యార్థులు చేస్తున్న పరిశోధనలు ఉపయోగపడుతున్నాయి.

– డాక్టర్ ఎస్.సూర్యకుమారి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్, వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited Survey No 726, Laxmipuram Village, Kallur Mandal, Kurnool dist. 518218, A.P., and Printed at Jagati Publications Limited Survey No 726, Laxmipuram Village, Kallur Mandal, Kurnool dist 518218 A.P., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08518-287654,RNI Regn No. APTEL/2008/23808.